


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 287 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల శుక్రవారం 19 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 287 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA FRI 19 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur






## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు..

### 'కోస్తా గ్రీన్ బెల్ట్'పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక సమీక్ష

- అటవీ, పర్యాటక ఉన్నతాధికారులతో పవన్ సమీక్షా సమావేశం
- గ్రీన్ జోన్స్ ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చన్న పవన్
- స్థానిక ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని సూచన

- మిగతా 2లో



## గాదె సాయికృష్ణ ఘటనపై సీబీఐ ఎంక్వైరీ జరగాలి

పెన్ పవర్ డెస్క్:ఏపీలోని విజయవాడలో గాదె సాయికృష్ణ అనే యువకుడి లాకప్ డెత్ దుమారం రేపి న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పోలీసు ల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ( జూన్ 18 ) వైసీపీ అధినేత జగన్ గాదె సాయికృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు జగన్. గాదె సాయి కృష్ణ ఘటనపై సీబీఐ ఎంక్వైరీ జరగాలని

- మిగతా 2లో

## తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ.. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూ

- తిరుపతిలో జేఎస్ఎస్ మహావిద్యాపీఠం ఆఫ్-క్యాంపస్ ఏర్పాటు
- మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం
- 74 కోర్సులతో 10 వేల మందికి పైగా విద్యార్థులకు ఉన్నత విద్య
- ప్రాజెక్టు ద్వారా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన
- ప్రతిష్ఠాత్మక నాక్ ఏంం గుర్తింపు పొందిన జేఎస్ఎస్ విద్యాసంస్థ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా కొలువుదీరిన ప్రజాప్రభుత్వంలో విద్యా రంగం అభివృద్ధికి కీలక అడుగు పడింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ రానుంది. మైసూరు కేంద్రంగా పనిచేస్తున్న జగద్గురు శ్రీ శివరాత్రీశ్వర (జేఎస్ఎస్) మహావిద్యాపీఠం, తమ ఆఫ్-క్యాంపస్‌ను తిరుపతిలో

- మిగతా 2లో





## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం' మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

- పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే ఏపీకి అగ్రస్థానం
- కేజీబీవీ హాస్టళ్లలో విద్యార్థినులందరికీ బంక్ బెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం
- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయానికి నిర్ణయం
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో

- మిగతా 2లో

## విప్ జారీ చేసినా ఫలితం లేదు.. ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చిన ఎంపీలు!

- 9 మంది ఎంపీల్లో ముగ్గురే సమావేశానికి హాజరు
- ఢిల్లీలో నిర్వహించిన కీలక భేటీకి ఆరుగురు ఎంపీల గైర్హాజరు
- గైర్హాజరైన వారిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంజయ్ రౌత్
- సమావేశానికి వచ్చిన వారే తమవాళ్లని వ్యాఖ్య
- మిగతావాళ్లు ద్రోహులంటూ విమర్శలు
- వారు ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరనున్నారని జోరుగా ప్రచారం

- మిగతా 2లో





## పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు.. ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!

- తగ్గిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు
- దీంతో దిగొచ్చిన ముడి చమురు ధరలు
- రిటైల్ ధరలూ తగ్గుతాయని ప్రజల ఆశాభావం
- వెంటనే సాధ్యం కాదన్న సురేశ్ గోపీ
- ముడి చమురు సరఫరాలో ఇంకా ఇబ్బందులు
- అవి సద్దుమణిగాకే ఇంధన ధరల్లో సవరణకు అవకాశం

పెన్ పవర్ డెస్క్:అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గవని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ స్పష్టం చేశారు. ఇంధన ధరల నిర్ణయంలో ముడిచమురు

- మిగతా 2లో



## రైతు బీమా ఎగ్గొట్టే కుట్ర..

### 7,600 మృతుల కుటుంబాలకు బీమా డబ్బులు రాలేదు: జీవన్ రెడ్డి

- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తున్నారన్న జీవన్ రెడ్డి
- కాంగ్రెస్ నాయకులనే ప్రజలు కనుమరుగు చేస్తారని వ్యాఖ్య
- ఉన్న పథకాలను చెడగొట్టొద్దని హితవు


- మిగతా 2లో

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

### హైకోర్టుకు తెలిపిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ ఒక 'కొత్త డార్క్ వెబ్'గా రూపాంతరం చెందిందని, సైబర్ నేరగాళ్లు, ఉగ్రవాదులు, పరీక్షల అక్రమాలకు పాల్పడే ముఠాలకు ఇది అడ్డాగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు

- మిగతా 2లో




## పాకిస్థాన్‌లో అంతా ఐఎస్ఐ పెత్తనమే.. చట్టసభ నిర్ణయాలను ప్రభావితం చేశారు

### పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

- ఐఎస్ఐ గుప్పిట్లోనే పాక్ చట్ట సభలు నడిచాయన్న ఖవాజా ఆసిఫ్
- ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్య
- ఏకంగా స్పీకర్ నివాసంలో అధికారిక సమావేశాల్లో పాల్గొనేవారని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య పాలన అనేది కేవలం ఒక ప్రహసనమని.. అక్కడ తెరవెనుక అంతా సైన్యం, నిఘా సంస్థల మాటే నడుస్తుందని అంతర్జాతీయ సమాజం ఎప్పటి నుంచో చెబుతున్న పచ్చి నిజం. ఇప్పుడు అదే నిజాన్ని స్వయంగా ఆ దేశ రక్షణ మంత్రే పార్లమెంట్ వేదికగా అంగీకరించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. పాక్ నిఘా సంస్థ 'ఐఎస్ఐ' గుప్పిట్లోనే ఆ దేశ చట్ట సభలు నడిచాయంటూ

- మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## యూపీలో ఎన్డీయే సరికొత్త వ్యూహాలు

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో సమాజ్ వాదీ పార్టీ ని లక్ష్యంగా చేసుకుని అధికార ఎన్డీయే కూటమి సరికొత్త వ్యూహాలకు తెరలేపింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పార్టీల ఎంపీలు చీలిపోయి ఎన్డీఏకు మద్దతు ప్రకటించడంతో యూపీలోనూ అదే తరహా రాజకీయాలు జరుగుతాయన్న చర్చ ప్రారంభమయింది. యోగి ఆదిత్యనాథ్ క్యాబినెట్‌లో మంత్రి, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్ చేసిన సంచలన వ్యాఖ్యలు యూపీ రాజకీయాల్లో పెను తుఫానును సృష్టించాయి. సమాజ్ వాదీ పార్టీకి చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ ఎంపీలు బీజేపీ వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే ఎస్పీలో భారీ చీలిక రాబోతోందని ఆయన ప్రకటించారు.యూపీ మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ తన సోషల్ మీడియా వేదికగా ఎస్పీ అగ్రనేత రామ్ గోపాల్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఒక రహస్య లేఖ సమర్పించారని ఆరోపించారు. యూపీని గతంలో కుదిపేసిన మైనింగ్ కుంభకోణం, గోమతి రివర్ ఫ్రంట్ స్కామ్‌ల మాస్టర్‌మైండ్ ఎవరో అందరికీ తెలుసని.. ఇప్పుడు ఆ కేసుల ఉచ్చు గట్టిగా బిగుస్తుండటంతో ఎస్పీ నేతల్లో ఆందోళన మొదలైందని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థల భయంతో , నియోజకవర్గాల నిధుల కోసమే స మొత్తం సమాజ్ వాదీ పార్టీ బీజేపీలో చేరేందుకు లోపాయకారీగా లైన్ క్లియర్ చేసుకుంటోందని, అందులో భాగంగానే 21 మందికి పైగా ఎంపీలు టచ్‌లోకి వచ్చారని రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.మంత్రి రాజ్‌భర్ చేసిన ఈ మైండ్ గేమ్‌పై సమాజ్ వాదీ పార్టీ అధినేత, లోక్‌సభ ఎంపీ అఖిలేష్ యాదవ్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇవన్నీ కేవలం ఓటమి భయంతో బీజేపీ ఆడుతున్న చౌకబారు నాటకాలని కొట్టిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో యూపీ ప్రజలు బీజేపీకి గట్టి బుద్ధి చెప్పారని, ఆ పరాజయాన్ని జీర్ణించుకోలేక ఇటువంటి మైండ్ గేమ్స్ ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో 37 స్థానాలతో మూడో అతిపెద్ద పార్టీగా అవతరించిన తమ పార్టీ ఎంతో పటిష్టంగా ఉందని, తమ పార్టీ ఎంపీలు ఎవరూ కూడా ప్రలోభాలకు లొంగే ప్రసక్తే లేదని అఖిలేష్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చీలిక వస్తుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని అఖిలేష్ తిప్పికొడుతూ.. రాబోయే 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో కలిసి ఉమ్మడిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఏ విధంగానైతే మట్టికరిపించామో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ఫార్ములాతో యోగి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాల మధ్య విభేదాలు సృష్టించి మైలేజ్ పొందాలని చూస్తున్న బీజేపీ పప్పులు ఉమ్మడి యూపీలో ఉడకవని, అసలైన ప్రజా సమస్యలైన నిరుద్యోగం, ఆరోగ్య రంగా పతనంపై మాట్లాడకుండా అధికార పక్షం ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో శివసేన కి చెందిన ఎంపీలు షిండే వర్గంలో విలీనం అయ్యారు. రాజ్‌భర్ చేసిన ఈ వ్యాఖ్యలు యూపీ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. లోక్‌సభలో మేజిక్ ఫిగర్ దాటినప్పటికీ, విపక్షాల బలాన్ని మరింత కుంగదీయాలనే వ్యూహంతో బీజేపీ ఆపరేషన్ లోటస్ ను దేశవ్యాప్తంగా విస్తరిస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే, అఖిలేష్ యాదవ్ తన ఎంపీలు, కేడర్‌ను కాపాడుకుంటూ 2027 పోరుకు ఎలా సిద్ధం కాబోతున్నారనేది రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల సరళిని శాసించనుంది

## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు.. 'కోస్తా గ్రీన్ బెల్ట్'పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక సమీక్ష

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో స్పీడ్ పెంచింది. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహజ వనరులను వాడుకుంటూ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నిరంతరం కసరత్తులు చేస్తున్నారు. ఇందులో భాగంగా... ఏపీకి ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని అటు టూరిజం పరంగా, ఇటు పర్యావరణ పరంగా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళుతోంది.ఏపీ కోస్తా తీరాన్ని శరవేగంగా అభివృద్ధి చేయడమే కాకుండా, పర్యావరణ రక్షణ కోసం 'కోస్తా గ్రీన్ బెల్ట్'ను విస్తరించేందుకు డిప్యూటీ పవన్ కల్యాణ్ నడుం బిగించారు. ఇందులో భాగంగా ఈరోజు సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.తీర ప్రాంతాల్లో భారీగా మొక్కలు నాటి, హరిత వలయాలను (గ్రీన్ జోన్స్) ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చని, తుపానుల తీవ్రతను తగ్గించవచ్చని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీనికోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ గ్రీన్ బెల్ట్ ప్రాజెక్ట్‌లో కేవలం ప్రభుత్వానిదే కాకుండా స్థానిక ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లో సామాజిక అడవుల (రాశీఎఋశ్రీ ఖీశీతీవర్‌తీఎ) పెంపకానికి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించాలని, తద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులకు స్పష్టం చేశారు.

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

- మొదటి పేజి తరువాయి

విన్నవించింది. నీట్-యూజీ 2026 రీ-టెస్ట్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై విధించిన తాత్కాలిక నిషేధాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది.జూన్ 21న జరగనున్న నీట్ రీ-టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గత మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించడంతో పాటు, పరీక్షను రద్దు చేసి పునర్నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, 'నీట్ మాఫియా' వంటి టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా మళ్లీ అక్రమాలు జరగకుండా నిరోధించేందుకే జూన్ 22 వరకు ఈ తాత్కాలిక నిషేధం విధించినట్లు కేంద్రం స్పష్టం చేసింది.టెలిగ్రామ్‌లోని ప్రైవసీ ఫీచర్లను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను గోప్యంగా ఉంచుతూ సులభంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తన అఫిడవిట్‌లో ఆరోపించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ, మాదకద్రవ్యాల సరఫరా, ఉగ్రవాద ప్రచారం, సైబర్ దాడులు, ఆర్థిక మోసాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు టెలిగ్రామ్ వేదికగా మారిందని పేర్కొంది. మరోవైపు, ప్రభుత్వ నిర్ణయం భారతదేశంలోని సుమారు 150 మిలియన్ల వినియోగదారుల భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని ఆరోపిస్తూ టెలిగ్రామ్ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కొందరు నేరగాళ్ల చర్యల వల్ల వినియోగదారులందరినీ శిక్షించడం సరికాదని వాదించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, టెలిగ్రామ్‌కు ఎటువంటి తక్షణ ఊరట కల్పించలేదు. నీట్ పరీక్ష పవిత్రతను కాపాడేందుకే ఈ తాత్కాలిక చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

# బాదం పప్పు అవినీతి ఆరోపణల కలకలం..! ఏసీబీ దాడి తప్పించుకున్నారా..?

**బాదం పప్పు బాగోతాలు - ఎపిసోడ్ 21**

- ప్రైవేట్ సెటిల్‌మెంట్లు, కాల్ డేటా విచారణ..!
- బాదం పప్పు సర్వీస్ రికార్డులపై ఉన్నతాధికారుల దృష్టి
- రూరల్ అనుభవంతో ఆదాయ మార్గాలపై పట్టు..
- పట్టణ పోస్టింగ్ కోసం రాజకీయ పలుకుబడి వినియోగించారా..?
- రోజువారీ ప్రైవేట్ సెటిల్‌మెంట్లపై తీవ్ర ఆరోపణలు
- ఏసీబీ దాడి సమాచారం లీక్ అయ్యిందా..?
- కాల్ డేటా, మధ్యవర్తుల పాత్రపై విచారణ
- సర్వీస్ రికార్డుల పరిశీలనలో ఉన్నతాధికారులు

**తాడేపల్లిగూడెం ప్రాంతంలో విధులు నిర్వహించిన కాలంలో అక్రమ సెటిల్‌మెంట్లు, అవినీతి ఆస్తుల వ్యవహారాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారిపై మళ్లీ చర్చ మొదలైంది. ఏసీబీ దాడి సమాచారం లీక్ కావడంతో కీలక చర్యలు నిలిచిపోయాయన్న ప్రచారం నేపథ్యంలో ఉన్నతాధికారుల పరిశీలన కొనసాగుతున్నట్లు సమాచారం.**

**ఎడిటర్ పెన్ పవర్, భీమవరం జూన్ 18:**




తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గతంలో రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు మూడు సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన ఒక పోలీసు అధికారిపై ప్రస్తుతం తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక పరిస్థితులు, వివిధ ఆదాయ వనరులు, వివాదాల స్వభావంపై పూర్తిస్థాయి అవగాహన ఏర్పరుచుకున్న అనంతరం పట్టణ ప్రాంతంలో పోస్టింగ్ పొందేందుకు రాజకీయ ప్రభావాన్ని వినియోగించుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ప్రభావశీల నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటూ, స్టేషన్ వ్యవహారాలపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. పై అధికారుల సూచనలను పక్కనబెట్టి, సహచర అధికారులు మరియు సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.అంతేకాకుండా, రోజుకు ఐదు నుంచి పది వరకు ప్రైవేట్ సెటిల్‌మెంట్లు నిర్వహించేవారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత గొడవలు వంటి అనేక అంశాల్లో మధ్యవర్తిత్వం పేరిట భారీ మొత్తాలు వసూలు చేసినట్లు ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాల ద్వారా కోట్ల రూపాయల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.ఇదే సమయంలో, సుమారు పది రోజుల ముందు జరగాల్సిన ఏసీబీ దాడి చివరి నిమిషంలో విఫలమైందన్న వార్తలు కూడా చర్చనీయాంశమయ్యాయి. దాడికి సంబంధించిన సమాచారం ముందుగానే లీక్ కావడంతో ముగ్గురు పోలీసు అధికారులు అప్రమత్తమై చర్యల నుంచి తప్పించుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఆ సమయంలో దాడి విజయవంతమై ఉంటే సంబంధిత అధికారులపై సస్పెన్షన్ చర్యలు తీసుకునే పరిస్థితి వచ్చేదని

కొందరు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారానికి సంబంధించిన కాల్ డేటా రికార్డులు, మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మీడియా బ్రోకర్ల పాత్ర, ఆర్థిక లావాదేవీల వివరాలు తదితర అంశాలపై సమాచారం సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వివిధ ఫిర్యాదులు, ఆరోపణలు,

స్థానికంగా ప్రచారంలో ఉన్న సమాచారాన్ని పరిశీలిస్తూ ఉన్నతాధికారులు పూర్తి నివేదిక కోరినట్లు సమాచారం.

మరోవైపు, సంబంధిత పోలీసు అధికారి సర్వీస్ రికార్డులు, గత బదిలీలు, షోకాజ్ నోటీసులు, ఫిర్యాదుల చరిత్ర వంటి అంశాలను జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఆరోపణల నిజానిజాలు అధికారిక విచారణలో తేలాల్సి ఉన్నప్పటికీ, ఈ వ్యవహారం ప్రస్తుతం పోలీసు శాఖతో పాటు రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది.

## తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ.. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూ

- మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో అమరావతిలో ఏపీ ఉన్నత విద్యామండలి, జేఎస్ఎస్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. ఈ ఒప్పంద పత్రాలపై ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ ప్రో ఛాన్సలర్ డా.బి.సురేష్ సంతకాలు చేసి మార్చుకున్నారు.70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన జేఎస్ఎస్ విద్యాసంస్థకు భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలు ఉన్నాయి. మైసూరు కేంద్రంగా ఉన్న జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జీూ ూఎజు=), నాక్ నుంచి ూం గుర్తింపు పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయం. ప్రతిష్ఠాత్మక ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానంలో, ఓవరాల్‌గా 38వ స్థానంలో నిలిచి తన నాణ్యతను చాటుకుంది.

**10 వేల మంది విద్యార్థులకు అవకాశం**

ప్రతిపాదిత తిరుపతి క్యాంపస్‌ను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటు చేస్తారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ విభాగాల్లో మొత్తం 74 కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. క్యాంపస్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాక, 10 వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించనున్నారు. వీటికి అదనంగా హెల్త్‌కేర్‌లో ఏఐ, సెమీకండక్టర్ అప్లికేషన్స్, హెల్త్ పాలసీ అండ్ గవర్నెన్స్, ఏరోస్పేస్ మెడిసిన్ వంటి ఆరు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా నెలకొల్పనున్నారు.

**20 వేల ఉద్యోగాలు.. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా..**

ఈ ఒప్పందం ప్రకారం, తిరుపతిలో క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, చట్టబద్ధమైన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సింగిల్-విండో విధానాన్ని కల్పిస్తుంది. క్యాంపస్ నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయాన్ని జేఎస్ఎస్ మహావిద్యాపీఠమే భరిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఇది స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా రాష్ట్ర యువతకు గొప్ప అవకాశాలను అందిస్తుంది. ఈ కార్యక్రమంలో జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ రిజిస్ట్రార్ డా.బి.మంజునాథ, డీన్(రీసెర్చ్) డా. ప్రశాంత్ ఎమ్ విశ్వనాథ్, కేపీఎంపీ అడ్వైజరీ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ ఎస్.రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు.. ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!

- మొదటి పేజి తరువాయి

ధరలతో పాటు రవాణా, సరఫరా, మార్కెట్ పరిస్థితుల వంటి అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు.తక్కువ ధరకు కొనుగోలు చేసిన ముడిచమురు భారత్‌కు చేరేందుకు సమయం పడుతుందని సురేశ్ గోపీ చెప్పారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రద్దీ ఎక్కువగా ఉండటంతో సరఫరా ప్రక్రియ సాధారణ స్థితికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అంతర్జాతీయ ధరలు తగ్గిన వెంటనే దేశీయ ఇంధన ధరలను తగ్గించడం సాధ్యం కాదన్నారు.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇటీవల గ్లోబల్ ఇంధన మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు చోటుచేసుకున్నాయని మంత్రి తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం పూర్తిగా వినియోగదారులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం గణనీయమైన భారం భరించిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ.12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు.ఇంధన ధరలు పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ పన్నులను తగ్గించి ఆదాయాన్ని వదులుకోలేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 78 డాలర్లకు చేరగా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 75 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. అయితే ఈ తగ్గుదల ప్రభావం దేశీయ ఇంధన ధరలపై కనిపించాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## పాకిస్థాన్‌లో అంతా ఐఎస్ఐ పెత్తనమే.. చట్టసభ నిర్ణయాలను ప్రభావితం చేశారు

- మొదటి పేజి తరువాయి

రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నేరుగా జాతీయ అసెంబ్లీలోనే బాంబు పేల్చారు. పాక్ జాతీయ అసెంబ్లీ సమావేశాల్లో రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ... మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. నాడు ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న జనరల్ ఫైజ్ హమీద్‌కు ఇమ్రాన్ ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని... ఆయన ఏకంగా నాటి స్పీకర్ నివాసంలో జరిగిన అధికారిక సమావేశాల్లో పాల్గొని చట్టసభ కార్యకలాపాలను, కీలక నిర్ణయాలను శాసించారని వెల్లడించారు.ఐఎస్ఐ ఒత్తిళ్ల కారణంగానే చట్టసభలో కొన్ని కీలక మార్పులు చేయాల్సి వచ్చిందన్నారు. ముఖ్యంగా యాంటీ మనీలాండరింగ్ చట్ట సవరణ పూర్తిగా నిఘా సంస్థకు అనుకూలంగా, వారి ఆదేశాల మేరకే అమల్లోకి తెచ్చారని సంచలన నిజాలు బయటపెట్టారు.

అయితే ఇమ్రాన్ ఖాన్ కాలంలో ఐఎస్ఐ పెత్తనాన్ని తప్పుబట్టిన ఖవాజా ఆసిఫ్... తమ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం సైన్యంతో కలిసి 'హైబ్రిడ్' విధానంలో నడుస్తోందని సమర్థించుకున్నారు. ప్రస్తుతం తమ దేశంలో పౌర-సైనిక హైబ్రిడ్ పాలనా విధానం అమలవుతోందని, దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొనడం గమనార్హం. అంటే.. పేరుకు ప్రజా ప్రభుత్వం ఉన్నా, ఆర్మీ సపోర్ట్ లేనిదే తాము కూడా ఏమీ చేయలేమని ఆయన పరోక్షంగా ఒప్పుకున్నట్టయింది.

## విప్ జారీ చేసినా ఫలితం లేదు.. ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చిన ఎంపీలు!

ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)లో తిరుగుబాటు ఊహాగానాలు మరింత బలపడ్డాయి. పార్టీ విప్ జారీ చేసినప్పటికీ ఢిల్లీలో గురువారం నిర్వహించిన కీలక సమావేశానికి 9 మంది లోక్‌సభ ఎంపీల్లో కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో పార్టీ మరోసారి చీలిక దిశగా వెళుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది.

పార్టీ ఎంపీల కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభౌ వాజే మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీలు దూరంగా ఉండటం కలకలం రేపింది. ఈ పరిణామం ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరికపై వస్తున్న ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. సమావేశానికి ముందు హాజరైన ఎంపీల పేర్లను ప్రత్యేకంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా స్పందించిన సంజయ్ రౌత్ గైర్హాజరైన ఎంపీలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమావేశానికి వచ్చిన వారే తమవాళ్లని, రాని వాళు ద్రోహులని మండిపడ్డారు.పార్టీని చీల్చేందుకు ప్రయత్నిస్తున్నవారిపై కూడా రౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు, కేంద్ర దర్యాప్తు సంస్థల బెదిరింపులతో తమను భయపెట్టలేరని వ్యాఖ్యానించారు. అవసరమైతే మళ్లీ జైలుకు వెళ్లేందుకూ సిద్ధమేనని చెప్పారు. ఆరుగురు ఎంపీల మద్దతుతో ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు కోరుతూ తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సంప్రదించినట్లు బుధవారం వార్తలు వెలువడ్డాయి. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు పొందాలంటే మూడొంతుల మద్దతు అవసరం. ప్రస్తుతం గైర్హాజరైన ఎంపీల సంఖ్య కూడా ఆ స్థాయిలో ఉండటం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

అయితే ఇప్పటివరకు ఆయా ఎంపీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు ఈ వ్యవహారంపై ఏక్‌నాథ్ షిండే కూడా మౌనం పాటిస్తున్నారు. దీంతో మహారాష్ట్ర రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

## రైతు బీమా ఎగ్గొట్టే కుట్ర..

తెలంగాణలో రైతు సమస్యలను అధికార కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తే... ప్రజలు ఈ కాంగ్రెస్ నాయకులనే కనుమరుగు చేస్తారని అన్నారు.రాష్ట్రంలో వివిధ కారణాలతో దాదాపు 7,600 మంది రైతులు మరణిస్తే... వారికి అందాల్సిన రైతు బీమా డబ్బులు ఇప్పటివరకు రాలేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎల్ఐసీకి ఇన్స్యూరెన్స్ ప్రీమియం సకాలంలో చెల్లించకపోవడం వల్లే ఈ క్లెయిమ్స్ ఆగిపోయాయనే వార్తలు వస్తున్నాయన్నారు. ఇది కేసీఆర్ తీసుకొచ్చిన పథకం కాబట్టే... దీనిని ఎలాగైనా మూలనపడేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. చేతనైతే కొత్త పథకాలు తేవాలి తప్ప, ఉన్న పథకాలను చెడగొట్టవద్దని హితవు పలికారు.మొత్తం 33 రకాల వడ్లు ఉంటే.. ప్రభుత్వం కేవలం 7 రకాల వడ్లను మాత్రమే బోనస్‌కు గుర్తిస్తోందన్నారు. అయితే ఈ 7 రకాల వడ్లు సాగు చేస్తే ఎకరానికి కేవలం 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని, అదే మిగతా 26 రకాల వడ్లు వేస్తే ఎకరానికి ఏకంగా 30 క్వింటాళ్ల పంట పండుతుందని చెప్పారు. ప్రభుత్వం చెప్పిన ఆ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి నష్టపోతారని... అంటే ఒక్కో రైతు ఎకరానికి దాదాపు రూ. 24 వేల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.

## గాదె సాయికృష్ణ ఘటనపై సీబీఐ ఎంక్వైరీ జరగాలి

- మొదటి పేజి తరువాయి


డిమాండ్ చేశారు జగన్. ఈ ఘటనలో ఏసీపీ, సీపీ సహా అందరి పాత్ర తేలాలని అన్నారు జగన్. సీఐ సస్పెన్షన్ అనేది కేవలం కంటితుడుపు చర్య అని అన్నారు. సీఐని అరెస్ట్ చేయకుండా సాయి తల్లితో బేరసారాలు ఆడతారా అని మండిపడ్డారు జగన్. పోలీసులు, జనసేన లీడర్లు సాయి తల్లిని ప్రలోభపెడుతున్నారని అన్నారు జగన్. ఒక సీఐ స్టేషన్ పరిధిలో నెలలోనే రెండు చావులు నమోదవ్వడం దారుణమని అన్నారు జగన్.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# మహాప్రస్థానం నిర్మాణంతో తండ్రికి నిజమైన నివాళి

## --- రేపు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే చేతులు మీదుగా పునః ప్రారంభం






గూడూరు ,పెన్ పవర్, జూన్ 18 గూడూరు మండలం ముక్కొల్లు గ్రామంలో ఓ కుమారుడు తన తండ్రి కలను సాకారం చేస్తూ గ్రామానికి శాశ్వత ప్రయోజనం కలిగే అభివృద్ధి కార్యక్రమాన్ని అందించాడు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త సమ్మెట శ్రీహరి, తన తండ్రి దివంగత సమ్మెట వీరరాఘవయ్య ఆశయానికి అనుగుణంగా గ్రామ రుద్రభూమిని ఆధునిక మహాప్రస్థానంగా అభివృద్ధి చేశారు.ఎన్నో ఏళ్లుగా సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్మశానవాటికను పూర్తిస్థాయిలో పునర్నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి-4 పథకం సహకారంతో చేపట్టిన ఈ పనుల్లో ప్రహరీ గోడలు, ప్రధాన ద్వారాలు, విశ్రాంతి గదులు, అంత్యక్రియల కోసం ప్రత్యేక మండపం, త్రాగునీరు, విద్యుత్, స్నానాల గదులు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రాంగణాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అవసరమైన సందర్భాల్లో ఉపయోగపడేలా మార్చురీ బాక్సుల కోసం ప్రత్యేక గదిని కూడా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు పూర్తికాగా, ఈ నెల 20న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా మహాప్రస్థానం ప్రారంభం కానుంది.తన తండ్రి కోరిక మేరకు గ్రామ ప్రజలకు ఉపయోగపడే పనిని చేయగలిగినందుకు సంతోషంగా ఉందని సమ్మెట శ్రీహరి తెలిపారు. గ్రామాభివృద్ధికి అండగా నిలిచిన ఆయన సేవా భావాన్ని గ్రామస్తులు అభినందిస్తూ, ఇది ముక్కొల్లు చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమమని పేర్కొంటున్నారు.

# ప్రజల చెంతకు ఉచిత వైద్యం మంత్రి పెమ్మసాని




గుంటూరు, పెన్ పవర్, జూన్, 18, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల కోసం ఒక గొప్ప శుభపరిణామం చోటుచేసుకుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించిన అధునాతన మెడికల్ కేర్ వాహన కార్యక్రమంలో, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఑ నందిగామ నియోజకవర్గం పరిశీలకులు తాళ్ళ వెంకటేష్ యాదవ్ వారితో కలిసి పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య సేవ ప్రత్యేకతలు: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (హెచ్డీఫ్సీ బ్యాంకు ) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీస్సార్ ) నిధుల ద్వారా ఈ వాహనాన్ని సమకూర్చడం జరిగింది. ఈ మొబైల్ మెడికల్ వాహనం నేరుగా ప్రజల వద్దకే వెళ్తుంది. నెలకు సుమారు 1500 మంది రోగులకు దీని ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందుతాయి. బాధితులకు ఎలాంటి ఖర్చు లేకుండా 14 రకాల వైద్య పరీక్షలను (మెడికల్ టెస్ట్స్ ) పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తారు. గుంటూరు పార్లమెంట్ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఈ అద్భుతమైన అవకాశాన్ని కల్పించిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కి అలాగే ఇందుకు సహకరించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాజమాన్యానికి (హెచ్డీఫ్సీ బ్యాంకు మానేజ్మెంట్ ) నా హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు

# విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కట్టుదిట్టమైన ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




విజయవాడ, పెన్ పవర్, జూన్, 18, దేశ వ్యాప్తంగా ఈ నెల 21న నీట్ (యూజీ) - 2026 పునఃపరీక్ష జరగనున్న నేపథ్యంలో పరీక్ష నిర్వహణలోని ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని అధికారులను కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నీట్ పరీక్ష నిర్వహణపై సమన్వయ సమావేశం జరిగింది. కో ఆర్డినేటర్లు, అబ్జర్వర్లు, పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు తదితరులు హాజరైన ఈ సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ హాజరై పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో ప్రతి దశ అత్యంత కీలకమని.. ప్రశ్నపత్రాల భద్రత నుంచి పరీక్ష ముగిసే వరకు అన్ని ప్రక్రియలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 31 పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో పరీక్షకు మూడు గంటల సమయం ఉండగా.. ఈసారి 15 నిమిషాలు అదనపు సమయం అందుబాటులో ఉంటుందని.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాన్ని చూసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షకు సకాలంలో హాజరయ్యేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. బయోమెట్రిక్ తీసుకోవడంలో విద్యార్థులకు చిన్నపాటి అసౌకర్యం కూడా కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత, భద్రత, వైద్య శిబిరం తదితర ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు కూడా అదే రోజున జరగనున్నందున పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రవాణా, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్, స్మార్ట్ వాచ్, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని పేర్కొన్నారు. ప్రతి గదిలో గోడ గడియారం తప్పనిసరిగా ఉంటుందన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, నీట్ కోఆర్డినేటర్లు డా. ఎం.గోపీకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు...

# ముఖ్యమంత్రి రావడం నియోజకవర్గ ప్రజల అదృష్టం : ప్రత్తిపాటి

### శనివారం చిలకలూరిపేట నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన

### చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో ముఖ్యమంత్రి అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ యోజన కార్యక్రమంలో పాల్గొంటారు : పల్నాడు కలెక్టర్ కృతికాశుక్లా



చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూన్ 18: చిలకలూరిపేట : కూటమిప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రిహోదాలో ప్రియతమ నాయకులు చంద్రబాబు తొలిసారి నియోజకవర్గానికి విచ్చేయడం నిజంగా ప్రజల అదృష్టంగా భావిస్తున్నామని, ప్రజా నాయకుడి పర్యటనను ప్రజలు విజయవంతం చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు.గురువారం ఆయన జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, నియోజకవర్గ టీడీపీ నాయకులతో కలిసి శనివారం జరిగే ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్రత్తిపాటి, కలెక్టర్ కృతికా శుక్లాలు విలేకరులతో మాట్లాడారు.

ముఖ్యమంత్రి కార్యక్రమాలను విజయవంతం చేస్తాం..

శనివారం చిలకలూరిపేట నియోజకవర్గంలో జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమాలను మునుపెన్నడూ లేని విధంగా విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి మొదటిసారి నియోజకవర్గానికి రావడం నిజంగా తమ ప్రజల అదృష్టమని ఆయన చెప్పారు. ఎన్నికలకు ముందు మూడుపార్టీలు కూటమిగా ఏర్పడ్డాక, నియోజకవర్గంలో ప్రధాని మోదీ సభ నిర్వహించి, భారీస్థాయిలో విజయవంతం చేశామని ఆయన తెలిపారు. మరలా నేడు ముఖ్యమంత్రి పర్యటనకు నియోజకవర్గం వేదిక కావడం తమకెంతో సంతోషాన్నిచ్చిందని ఆయన చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రి ఎప్పుడొస్తారా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.

20న జరిగే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంతో పాటు. అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ యోజన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చిలకలూరిపేటకు వస్తున్నట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఆ రోజున ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ దిగిన వెంటనే ప్రకృతి సేద్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడతారని, అనంతరం అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడ జరిగే కార్యకలాపాలు పరిశీస్తారని ప్రత్తిపాటి తెలియచేశారు. భోజన విరామానంతరం 1200 మందితో జరిగే టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు. అనంతరం పశ్చిమ బెంగాల్ నుంచి ప్రధాని మోదీ పాల్గొనే పీఎం కిసాన్ యోజన నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఇక్కడినుంచే లైవ్ లో పాల్గొంటారని, తర్వాత అన్నదాతా సుఖీభవ ప్రజావేదిక నుంచి రైతులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని ప్రత్తిపాటి చెప్పారు. ముఖ్యమంత్రి కార్యక్రమాలను టీడీపీ మరియు మిత్రపక్షాల శ్రేణులు విజయవంతం చేయాలని ప్రత్తిపాటి కోరారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటి, తాను సీఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించాము కృతికాశుక్లా

20వ తేదీన ముఖ్యమంత్రి చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల పంచాయతీకి రానున్న నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి, సీఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించడం జరిగిందని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఒకేరోజు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, అన్నదాతాసుఖీభవ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా వారికి మార్గనిర్దేశం చేసినట్టు ఆమె తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సంజన సిన్హా, ఆర్డీవో బాలకృష్ణ, డీఎస్పీ హనుమంతరావు, నియోజకవర్గ అబ్జార్వర్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, గ్రామ నాయకులు, వివిధ హోదాలలో ఉన్న అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ గ్రామీణ యువతకు కేంద్రం నుంచి రూ.25 కోట్ల మంజూరుమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు, పెన్ పవర్, జూన్, 18, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే దిశగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద కేంద్ర వాటాగా రూ.25 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి ఑ కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు.ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ, గ్రామీణ యువత సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేయడం సంతోషకరమని అన్నారు. డి డి యు -జి కె వై ద్వారా గ్రామీణ ప్రాంతాల యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించే అవకాశాలు మరింత విస్తరించనున్నాయని చెప్పారు. ఈ నిధుల మంజూరుతో రాష్ట్రంలో గ్రామీణ జీవనోపాధులు బలోపేతం కావడంతో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి సమగ్ర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంలో, విద్య మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం యువత సాధికారతకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, సుసంపన్న ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి దోహదపడుతోందని పేర్కొన్నారు.

# జిల్లాలో సాఫీగా సర్ ఇంటింటి సర్వే జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, పెన్ పవర్, జూన్, 18, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ-సర్ ప్రక్రియకు సంబంధించి ఇంటింటి సర్వే సాఫీగా జరుగుతోందని.. ఇప్పటివరకు బీఎల్‌వోల ద్వారా 2,74,614 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలో 17,13,445 మంది ఓటర్లు ఉన్నారని.. బీఎల్‌వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించడంతో పాటు వాటిని నింపి తిరిగి ఇవ్వడంలో సహకరిస్తున్నారన్నారు. అదేవిధంగా 10,870 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిలా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో ఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు కీలకపాత్ర పోషించేలా దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సగటున ఒక్కో బీఎల్‌వో పరిధిలో 956 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా జులై 14వ తేదీ వరకు బీఎల్‌వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందిస్తారని.. నింపిన వాటిని తిరిగి సేకరిస్తారని, ఇందుకు ప్రతి ఇంటికీ కనీసం మూడుసార్లు వెళ్లనున్నారని తెలిపారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా కార్యక్రమంలో పాల్గొని బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

# రాయవరం సచివాలయంలో రైతులకు వరి విత్తనాల పంపిణీ




గూడూరు, పెన్ పవర్, జూన్ 18 గూడూరు మండలం రాయవరం గ్రామ సచివాలయం ఖరీఫ్ సీజన్ వరి సాగుకు అవసరమైన విత్తనాలను రాయవరం పిఎసిఎస్ చైర్మన్ కోలపల్లి రజిని మరియు నియోజకవర్గ తెలుగుయువతఅధ్యక్షుడు ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేశారు.విత్తనాలు పొందేందుకు రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ వివరాలతో సచివాలయానికి హాజరు కావాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా రైతులు ముందస్తుగా విత్తనాలు తీసుకుని సాగుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు నాణ్యమైన విత్తనాల వినియోగం ఎంతో కీలకమని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులు ప్రభుత్వ సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విత్తనాలను పొందుతున్నారు.

# మంగళగిరి నియోజకవర్గంలో రూ. 610 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం మంత్రి పెమ్మసాని, మంత్రి నారా లోకేష్







గుంటూరు , పెన్ పవర్,జూన్, 18, మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను విద్యా, ఐటీ శాఖ మంత్రి మరియు స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ , కలిసి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని ప్రాంతాల్లో రూ. 604.32 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన అనంతరం మురుగునీటి నిర్వహణలో సమగ్ర మార్పులు చోటుచేసుకుని, ప్రజారోగ్యం మెరుగుపడటంతో పాటు పట్టణాల పరిశుభ్రతకు దోహదపడనుంది. అదేవిధంగా, కాజా గ్రామ సమీపంలోని చెరువు అభివృద్ధి పనులను రూ. 3.30 కోట్ల కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) నిధులతో చేపట్టగా, వాటిని కూడా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వాకింగ్ ట్రాక్, ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలు, పచ్చదనం పెంపు చర్యలు చేపట్టనున్నారు. దీంతో చెరువు పరిసరాలు ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా మారనున్నాయి. ఇక పాత మంగళగిరిలోని వైకుంఠ మహా ప్రస్థానం అభివృద్ధి పనులను రూ. 3.25 కోట్ల వ్యయంతో పూర్తిచేసి ప్రజలకు అంకితం చేశారు. ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసిన ఈ మహా ప్రస్థానం ద్వారా ప్రజలకు మరింత గౌరవప్రదమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ కమిషనర్ కె. మయూర్ అశోక్



గుంటూరు, పెన్ పవర్, జూన్, 18, సర్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరుకు బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారని, ఓటర్ల నుండి పూర్తిగా నింపబడిన ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించి ఆన్లైన్ ద్వారా డిజిటలైజేషన్ చేస్తున్నారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2,52,062, ఓటర్లలో 60,332 ఫారాలు పంపిణీ చేయబడి (23.94%), 346 డిజిటలైజ్ చేయబడ్డాయని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,78,555 ఓటర్లలో 52,609 ఫారాలు పంపిణీ చేయబడి (18.89%), 393 డిజిటలైజ్ చేయబడ్డాయని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకొని, ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓలకు త్వరితగతిన అందజేసి, సరైన, తప్పులులేని ఓటరు జాబితా తయారీకి ప్రతి ఓటరు సహకరించాలని కోరారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సర్ విధులు కేటాయించబడిన బిఎల్ఓలు పి.సాయి శ్రీకాంత్ (పిఎస్ 54), పి.దుర్గా ప్రసాద్ (పిఎస్ 234), బి.మహేష్ బాబు (పిఎస్ 250) కేటాయింపు ఉత్తర్వులు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ వారిని విధుల నుండి సస్పెండ్ చేయాలని పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ జి.సాంబశివరావుని ఆదేశించగా, ఆయన సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# భారీ బైక్ ర్యాలీతో కదిలిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, పెన్ పవర్, జూన్, 18, ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ రెండేళ్లలో గుంటూరు పశ్చిమలోనే రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు, కాలువల్లో పూడిక తీత పనులు, ట్రాఫిక్ నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి రూ.500 కోట్లకు పైగా పనులు పూర్తిచేశామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా గుంటూరు జిల్లా విజయోత్సవ బహిరంగ సభకు ముందు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుపేట టీడీపీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 600కు పైగా ద్విచక్ర వాహనాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పై ప్రజలు ఉంచిన నమ్మకమే రెండేళ్లుగా ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగడానికి కారణమని, గత ఐదేళ్లలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, అరాచకాలను గుర్తుచేసుకుంటూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు ఇచ్చిన తీర్పును కూటమి ప్రభుత్వం గౌరవిస్తోందన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనే సుమారు 20 వేల మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.9 కోట్లకు పైగా పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. అలాగే మూడు అన్నా క్యాంటీన్ల ద్వారా ప్రతిరోజూ దాదాపు 9 వేల మంది పేదలకు రూ.5కే భోజనం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం మూసివేసిన అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి పేదల ఆకలి తీర్చడం కూటమి ప్రభుత్వ గొప్ప నిర్ణయమన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా గుంటూరు పశ్చిమలోనే రూ.8 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద పార్టీ, రాజకీయ భేదాలు లేకుండా ప్రతి అర్హ కుటుంబానికి లబ్ధి చేకూరుస్తూ ఒక్క పశ్చిమ నియోజకవర్గంలోనే రూ.32 కోట్ల మేర ప్రయోజనం కల్పించామన్నారు. దీపం పథకం ద్వారా రూ.21 కోట్లకు పైగా లబ్ధి ప్రజలకు అందుతోందని వెల్లడించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ), నార్ల ఆడిటోరియం, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర కీలక ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ప్రజలకు అందుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి కూడా వైసీపీ నాయకులు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. చిన్న చిన్న లోపాలను భూతద్దంలో చూపిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తోందని, అమరావతి, పోలవరం వంటి రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన ప్రాజెక్టులకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కూటమి నాయకులు ఇదే ఐకమత్యంతో రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలని కోరారు.

# ప్రజలందరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవా లి--డి ఆర్ ఓ గంగాధర్





భట్టిప్రోలు, పెన్ పవర్ (జూన్18) దైనందిన జీవితంలో ప్రజలందరూ యోగాను ఒక భాగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి(డి ఆర్ ఓ)గంగాధర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని బౌద్ధ స్తూపం ఆవరణలో గురువారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డి ఆర్ ఓ గంగాధర్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యోగాంధ్రకు పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు,పలు శాఖల అధికారులు హాజరయ్యారు.డి ఆర్ ఓ గంగాధర్ గౌడ్, తదితర అధికారులు యోగాసనాలు వేసి స్ఫూర్తిగా నిలిచారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ భారతదేశంలో పూర్వకాలం నుంచి యోగాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సర్వరోగ నివారిణిలా యోగా పనిచేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మన ఆరోగ్య పరిరక్షణకు ఈ నెల 21వ తేదీ వరకు యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అందరూ యోగాను ప్రతిరోజు చేయాలన్నారు.ఈ కార్యక్రమాలు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో జరుగుతున్నాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని దేవాలయాలు, ప్రార్థనా మందిరాలలో యోగ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపినట్లు ఆయన చెప్పారు.దేవాలయా లు మరియు ప్రార్ధన స్థలాల పరిసర ప్రాంతాలు నిశ్శబ్దంతో ఉంటాయని,ఆ ప్రాంతాలు ఎంతో శాంతినిస్తాయని అటువంటి ప్రదేశంలో యోగ నిర్వహణ ద్వారా ప్రజలు వ్యక్తిగతంగా, ఉద్యోగపరంగా, మానసిక ఉల్లాసాన్ని పొందుతారని ఆయన చెప్పారు.యోగా మన భారతదేశంలో కనిపెట్టి,వందల సంవత్సరాల నుండి యోగ నిర్వహిస్తున్నారని ఆయన చెప్పారు.ఈ యోగాంధ్ర కార్యక్రమాలు ఈనెల 21న సూర్యలంక లో జిల్లా స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.21వ తేదీతో యోగాంధ్ర కార్యక్రమాలు ముగియనున్నప్పటికీ ప్రజలందరూ యోగాను నిరంతరం చేయాలన్నారు.ఈ యోగ కార్యక్రమాలపై ఆయుష్ శాఖ సిబ్బంది ప్రత్యేక శిక్షణ పొంది ప్రజలకు అందిస్తున్నారని ఆయన చెప్పారు. ఆయుష్ శాఖలో చాలా నైపుణ్యం కలిగిన వ్యక్తులు ఉన్నారని ఆయన చెప్పారు.మందుల ద్వారా తగ్గని ఎన్నో రోగాలు యోగా వలన తగ్గుతున్నాయని, ప్రజలందరూ వారికి వీలైన సమయంలో నిరంతరం యోగా, ప్రాణాయామం చేస్తూ వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం అనంతరం కళాశాల బాలికలు యోగాసనాలు వేసి చూపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మరియు వేమూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రభాకర్, దేవాదాయ శాఖ సహాయ సంచాలకు నాగయ్య,డి ఆర్ డి ఏ పి డి. బి సింగయ్య,యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి.చంద్రశేఖర్, రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి బి. శ్రీదేవి,మండల తహసిల్దారు జి. నాగరాజు,ఎంపీడీవో ఎస్ వెంకటరమణ, మండల పరిషత్, రెవిన్యూ కార్యాలయాల సిబ్బంది,పలు గ్రామాల వీఆర్వోలు, కార్యదర్శులు,ప్రజలు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయుర్వేదిక్ శాఖ ఆధ్వర్యంలో మెడికల్ అధికారి డా రాఘలత,ఫార్మాసిస్ట్ డా జి విజితేంద్ర, ఆయుష్ సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన ఆయుర్వేదిక్ మందులు అందజేశారు.


# వేగవంతమైన ఓటర్ల జాబితా పరిశీలన



భట్టిప్రోలు, పెన్ పవర్ (జూన్18) మండల కేంద్రమైన భట్టిప్రోలు గ్రామపంచాయతీ పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేర ఓటర్ల జాబితా పరిశీలన మండల కేంద్రమైన భట్టిప్రోలు లో వేగవంతంగా జరుగుతున్నది. పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి 222 పోలింగ్ బూత్ ఏజెంట్ డొక్కు శ్రీనివాసరావు మాట్లాడుతూ 15వ తేదీ నుండి ఓటర్ల పరిశీలన అధికారులతో పాటు రాజకీయ పక్షాల ప్రతినిధులు పాల్గొని పరిశీలిస్తున్నామ న్నారు.ఇంటింటికి తిరిగి పాత ఓటర్ల జాబితా మరియు దరఖాస్తు ఫారాలను అందించడం జరుగుతున్నాద న్నారు.ఉదయం నుండి సాయంత్రం వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీనివాసరావు తో పాటు,బూత్ లెవెల్ అధికారి మరియు వేల్పూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# వీరాంజనేయ షిరిడి సాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు





పెన్ పవర్ కారంపూడి జూన్ 18:-- మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలో వీరాంజనేయ షిరిడి సాయి మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ కాకడ హారతి పంచామృత పూర్వక అభిషేక కార్యక్రమం అలంకరణ నీరాజనం మంత్రపుష్ప తీర్థప్రసాద వితరణ జరిగాయి మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి అనంతరం అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి దాతలు చలమాద్రి గోత్రం వీరేపల్లి వెంకటకృష్ణ ధర్మపత్ని అహల్య కుమార్తె నేహ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది మరియొక దాత అయ్యావుల గోత్రం వారి తల్లి సాయి లక్ష్మీ జ్ఞాపకార్థం కుమారుడు చుండూరు రాకేష్ ధర్మపత్ని గాయత్రి ద్వారా పులిహోర పంపిణీ జరిగింది ఈ కార్యక్రమంలో సేవను అందించినవారు కొంగర సీతయ్య ధర్మపత్ని కోటేశ్వరమ్మ చింతల శారద, అతుకూరి వెంకటలక్ష్మి, సరస్వతి, కృష్ణవేణి, స్రవంతి,గజవల్లి లక్ష్మి, నర్సింహారావ్, అంజి,సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని శ్రీమతి గుండా మల్లెశ్వరి తెలిపింది. దేవాలయ ఆర్చకులు దిలీప్ కుమార్ ఆచార్యులు మాట్లాడుతు సాయిమంది రం లో జరిగే కార్యక్రమాలకు భక్తులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని రేపు జరిగే 23వ వార్షికోత్సవానికి భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా తెలియజేశారు

# పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం -- చేబ్రోలు మండల తహసీల్దార్ కళ్లెం శ్రీనివాస శర్మ





పెన్ పవర్,జూన్ 18చేబ్రోలు: పరిసరాల పరిశుభ్రత తోనే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని చేబ్రోలు మండల తహసీల్దార్ కళ్లెం శ్రీనివాస శర్మ పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకొని చేబ్రోలు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో మలేరియా మాసోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక డిగ్రీ కాలేజీ విద్యార్థులకు మలేరియా వ్యాధి లక్షణాలు, మలేరియా వ్యాధి సోకటానికి గల కారణాలు, దోమలు పెరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. నీటి నిలువలు దోమలకి ప్రధాన ఆవాసాలు, మలేరియా అంతం మన పంతం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా తెనాలి యుయల్ బి మలేరియా సబ్ యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ నీటి నిల్వలే దోమల పెరుగుదలకు ప్రధాన ఆవాసాలు కావున ప్రజలు వారానికి ఒకటి లేదా రెండుసార్లు నీటి నిల్వలను మార్చుకొని కొత్త నీటిని పట్టుకోవాలని నీటిని నిలవలపై మూతలు పెట్టి ఉంచుకోవాలని దోమతెరలు వాడుట పూర్తి వస్త్రధారణ ధరించుట ఉదయం సాయంత్రం సమయంలో తలుపులు కిటికీలు మూసుకొని ఉంచుట వంటి కార్యక్రమాల వలన దోమకాట నుండి రక్షణ పొందవచ్చునని తెలిపారు. చేబ్రోలు మండల తహసీల్దార్ శ్రీనివాస శర్మ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి ప్రధాన మూలమని ప్రజలు చెత్త చెదారమును కాల్వలలో వేయటం వలన నీటి ప్రవాహమునకు ఆటంకం ఏర్పడి నీరు నిలిచిపోవడం వలన దోమలు పెరుగుదలకు ఆవాసాలుగా మారుతాయని కనుక ప్రజలు పరిసరాల పరిశుభ్రత ,వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు అనంతరం చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ మహబూబ్ జానీ మాట్లాడుతూ మూడు రకాల దోమలు ఆరు రకాల వ్యాధులను వ్యాపింపజేస్తాయని, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలియజేయాలని జ్వరము అని అనుమానం ఉన్నచో వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్ష చేయించుకుని ఉచితంగా మందులు తీసుకోవాలని కోరినారు

# చంద్రబాబు నాయకత్వ పటిమతో రాష్ట్రంలో పుంజుకున్న పారిశ్రామికీకరణ : మంత్రి భరత్

## చిలకలూరి పేట ఆటోనగర్ ప్రారంభించి, వర్కర్స్ కు ప్లాట్లు కేటాయించిన మంత్రి భరత్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీలావు, ఎమ్మెల్సీ బి.టి. నాయుడు, టీటీడీ సభ్యులు జంగా కృష్ణమూర్తి.





చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూన్ 18: చిలకలూరిపేట : ఆటోనగర్ వర్కర్స్ కు అవసరమైన నైపుణ్యాలు, ఆర్థిక సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక, చంద్రబాబు నాయకత్వ పటిమతో రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగం పుంజుకుందని మంత్రి టీ.జీ భరత్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తితో కలిసి ఆటోనగర్ ప్రారంభించి, ఆటోవర్కర్స్ కు ప్లాట్లు కేటాయించారు. అనంతరం వారిని ఉద్దేశించి నాయకులు ప్రసంగించారు.

సులభతర విధానాలు, వేగవంతమైన అనుమతుల వల్లే రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు

కూటమిప్రభుత్వ సులభతర, వాణిజ్య విధానాలు, వేగవంతమైన అనుమతుల వల్లే రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, ఇచ్చిన హామీ ప్రకారం త్వరలోనే 20లక్షల ఉద్యోగాల అమలు హామీని నెరవేరుస్తామని భరత్ తెలిపారు. సుదీర్ఘ కాలం కూటమిప్రభుత్వం అధికారంలో ఉంటే ప్రజలతో పాటు, రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రత్తిపాటి కోరిక మేరకు ఆటోనగర్ అభివృద్ధికి అవసరమైన మరో రూ.2.80 కోట్లు త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని అధికారుల్ని ఆదేశించినట్టు భరత్ చెప్పారు. 2019-24లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతిని నీరుగార్చిందని, ఉన్న పరిశ్రమలను కూడా తరిమేసి, యువతను రోడ్డుకు ఈడ్చిందని భరత్ స్పష్టంచేశారు.

ఎంఎస్ఎంఈ పార్కులకు ధీటుగా ఆటోనగర్ అభివృద్ధి చెందాలి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట ఆటోనగర్ లో ప్లాట్లు పొందిన వారి ఆదాయం పెరగడంతో పాటు, నియోజకవర్గ అభివృద్ధిలో ఆటోనగర్ కీలక పాత్ర పోషించేలా వర్కర్స్ కృషి చేయాలని ప్రత్తిపాటి సూచించారు. ఎంఎస్ఎంఈ పార్కులకు ధీటుగా ఆటోనగర్లు అభివృద్ధి చెందాలని, అప్పుడే వాహన పరిశ్రమలపై ఆధారపడిన అందరికీ మెరుగైన ఉపాధి లభిస్తుందన్నారు. ఏపీఐఐసీ విభాగం సహకారంతో ఆటోవర్కర్స్ తమ పనితీరు మెరుగుపరుచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ప్లాట్లు పొందిన వర్కర్స్ వీలైనంత త్వరగా ఆటోనగర్ లో కార్యకలాపాలు ప్రారంభించాలని సూచించారు. వర్కర్స్ కు అవసరమైన సహాయసహకారాలు ఏపీఐఐసీ, ఎంఎస్ఎంఈ విభాగాల నుంచి అందుతాయని ఎమ్మెల్యే తెలిపారు. చిలకలూరిపేట ఆటోనగర్ ఉత్తమ పనితీరుతో రాష్ట్రానికే ప్రామాణికంగా నిలవాలన్నారు. ఆటోనగర్ కు అవసరమైన అదనపు భూసేకరణను కూడా త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. అర్హులైన వారందరికీ ప్లాట్లు కేటాయిస్తామన్నారు. మంత్రి టీ.జీ.భరత్ కుటుంబం, ముఖ్యంగా వారి తండ్రి వెంకటేశ్ తో మంచి సన్నిహిత సంబంధాలున్నాయని ప్రత్తిపాటి చెప్పారు. మొత్తం 42 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఆటోనగర్ అభివృద్ధికి అవసరమైన మరో రూ. 2.80 కోట్లు మంజూరయ్యేలా చూడాలని మంత్రి భరత్ ను ప్రత్తిపాటి సభాముఖంగా కోరగా ఆయన వెంటనే అధికారులతో మాట్లాడారు.

కాలానుగుణంగా ఆటోవర్కర్స్ తమ పనితీరు, నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి : ఎంపీ లావు

ఆటోనగర్ కార్మికులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ పనితీరు, నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు సూచించారు. ఇప్పటికే మార్కెట్లో ఎలక్ట్రిక్, బ్యాటరీ వెహికల్స్ వచ్చాయని, వాటిలో పెద్దగా విడిభాగాలు ఉండవని, ఈ పరిస్థితుల్లో ఆటోనగర్ పై ఆధారపడి బతికేవారు, తమ ఆలోచనా విధానం మార్చుకోవాలన్నారు. చిలకలూరిపేటకు ఆటోనగర్ ఏర్పాటు వెనక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కృషి ఎంతో ఉందని ఎంపీ తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు, రైతులకు ఉపయోగపడే క్లస్టర్లు ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాయని, చిలకలూరిపేటలో త్వరలో కార్పెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీ తెలిపారు. చేతి వృత్తులపై ఆధారపడే కార్మికులు గ్రూపులుగా ఏర్పడితే కేంద్రం నుంచి 90శాతం సబ్సిడీ రుణాలు లభిస్తాయని, వాటితో అధునాతన పరికరాలు, మిషన్లు కొని, శారీరక శ్రమ తగ్గించుకోవాలన్నారు. చిలకలూరిపేట ఆటోనగర్ ను కేవలం ఆటోనగర్ గానే ఉంచకుండా ఒక ఎంఎస్ఎంఈ యూనిట్లా మార్చాల్సిన బాధ్యత కార్మికులదేనని ఎంపీ స్పష్టం చేశారు. కార్యక్రమానంతరం స్థానిక ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిలకలూరిపేట ఆటోనగర్ పేరును ప్రత్తిపాటి పుల్లారావు ఆటోనగర్ గా మారుస్తూ తీర్మానం చేశారు.

కార్యక్రమంలో జిల్లా కో.ఆర్డినేటర్ బి.టి. నాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, నియోజకవర్గ అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్,

మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, అధికారులు ఎం.ఎస్.యం.ఈ సజ్జ సురేష్, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ సువర్ణ ఫణి, ఇంజనీర్ ఎండీ అబ్దుల్ రహీమ్, యూనియన్ నాయకులు నల్లమోతు సాంబశివరావు, షేక్ నభీ, కొండలు, టింకర్ బాబు, టీడీపీ నాయకులు మద్దూరి వీర రెడ్డి, ఇనగంటి జగదీష్, బత్తినేని శ్రీనివాసరావు, షేక్ జరీనా, అమర రమాదేవి, అంబటి సోముబాబు, పిల్లి కోటేశ్వరరావు , ముఖ్య నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా ప్రతి అర్హుడి ఓటు కాపాడటమే బిఎల్ ఓ, బిఎల్ ఏ ల లక్ష్యం - వరికూటి అశోక్ బాబు.



భట్టిప్రోలు పెన్ పవర్,జూన్ 18 ఎస్ ఐ ఆర్ కార్యక్రమం లో భాగంగా భట్టిప్రోలు 223 బూత్ ను పరిశీలించిన అశోక్ బాబు.భట్టిప్రోలు ఎన్నికలసంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న ఎస్ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా నేడు వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబుభట్టిప్రోలుమండల పరిధిలోని అద్దేపల్లి గ్రామంలో223 బూత్‌ను స్వయంగా పరిశీలించారు.ఈ తనిఖీలో అశోక్ బాబు తో పాటు వైసీపీ బి ఎల్ ఏ లు వేల్పూరి బాల సుబ్రమణ్యం(చిన్నారి), కంభం సుధీర్, బి ఎల్ ఓ చుక్కా జయ నాగలక్ష్మినాయకులు కంభం బుజ్జిబాబు, తలకోలయలమంద ,కసుకూర్తి భాస్కర్ , బడుగు గోపి తదితరులు పాల్గొన్నారు.బూత్ స్థాయిలో ఓటర్ జాబితాలో ఉన్న తప్పిదాలు, డెత్ ఎంట్రీలు, డబుల్ ఎంట్రీలు, కొత్తగా కల్పించాల్సిన పేర్లపై అధికారులతో చర్చించి తక్షణమే సరిచేయాలని కోరారు.

# హైద్రాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించిన మంత్రి సీతక్క





పెన్ పవర్,జూన్ 18 ,(జిల్లా బ్యూరో ) ములుగు మండలానికి చెందిన, జంపయ్య,అనారోగ్యంతో చికిత్సపొందుతుండగా, వారినిమంగపేట మండలం మల్లూరు గ్రామానికి చెందిన,జీ.లలిత,అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఉండగా వారిని,పస్ర మామిడిగూడెం గ్రామానికి చెందిన జనగాం సారయ్య ని హన్మకొండకి చెందిన ఎమ్.యాకయ్య, హైద్రాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారిని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, పరామర్శించి వైద్యులతో మాట్లాడి మెరుగైన,వైద్యంఅందించాలని కోరారు మంత్రి సీతక్క, వెంట నాయకులు తదితరులు పాల్గొన్నారు

# డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమలో జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై తక్షణ చర్యలు తీసుకోవాలి

## -- వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జిల్లెళ్ళ రమేష్ డిమాండ్

అమలాపురం పెన్ పవర్,జూన్ 18 కోనసీమ జిల్లాలో కొన్ని కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి, తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతున్న పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జిల్లెళ్ళ రమేష్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా ఫీజులు వసూలు చేయాల్సిన విద్యాసంస్థలు, కొన్నిచోట్ల అదనపు ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా తదితర అంశాల పేరుతో తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని పెంచుతున్నాయని ఆయన విమర్శించారు. పిల్లల విద్య కుటుంబాలకు భారం కాకుండా హక్కుగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యను లాభాపేక్షతో కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలని, విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఫీజుల నియంత్రణకు సమర్థమైన చర్యలు తీసుకోవాలని జిల్లెళ్ళ రమేష్ ప్రభుత్వాన్ని కోరారు...



# ఖరీఫ్ 2026 సీజన్‌కు సంబంధించి ఎరువుల పంపిణీపై ప్రత్యేక సమావేశం

పెన్ పవర్,జూన్ 18 చేబ్రోలు: చేబ్రోలు మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఖరీఫ్ 2026 సీజన్‌కు సంబంధించి ఎరువుల పంపిణీపై ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్ నుండి రైతులకు యూరియా మరియు డీఏపీ ఎరువుల పంపిణీ పూర్తిగా "ఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0" యాప్ ద్వారా నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ విధానం ద్వారా అర్హత కలిగిన ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు పారదర్శకంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ నూతన విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడం మరియు ఎరువుల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించడం కోసం జిల్లా, మండల మరియు గ్రామ స్థాయిలలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్‌లో తహసీల్దార్ గారు చైర్మన్‌గా, మండల వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా, ఎంపీడీఓ మరియు ఎస్‌హెచ్‌వో సభ్యులుగా వ్యవహరిస్తారని వివరించారు. ఈ కమిటీలు ఎరువుల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా పర్యవేక్షిస్తాయని తెలిపారు.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన చేబ్రోలు మండల తహసీల్దార్ శ్రీ శ్రీనివాస శర్మ గారు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎటువంటి అక్రమాలు, అవకతవకలు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీమతి ఊహారాణి గారు, విఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు (వి ఏ ఏ ఎస్) పాల్గొన్నారు. అధికారులు రైతులకు ఈ విధానంపై పూర్తి అవగాహన కల్పించి, ఖరీఫ్ సీజన్ మొత్తం ఎరువుల సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు



# విజయోత్సవ సభకు భారీ ఏర్పాట్లు..! అట్టహాసంగా ర్యాలీ సన్నాహకాలు ..!

మాచర్ల పెన్ పవర్,జూన్ 18 కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను పూర్తి చేసుకుని దిగ్విజయంగా మూడో ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నియోజకవర్గ స్థాయి విజయోత్సవ బహిరంగ సభకు గురువారం కూటమి శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. స్థానిక శ్రీనివాస మహల్ సెంటర్ నందు శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే విజయోత్సవ సభకు వేదికను తీర్చాతున్నారు. భారీగా తరలివచ్చే ప్రజల కోసం ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నీ ఏర్పాట్లును పూర్తి చేశారు. వేదిక వద్ద చిన్నారులు, మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రెండేళ్ల కాలంలో సాధించిన విజయాల ప్రస్థానాన్ని అతిరథ మహారథుల ప్రసంగాల రూపంలో వివరించనున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వంలో లబ్ది పొందిన లబ్ధిదారులు వారి అభిప్రాయాలను పంచుకోనున్నారు. విజయోత్సవ సభకు ముందుగా పట్టణంలో శ్రేణులు భారీ ర్యాలీ తీసేందుకు అట్టహాసంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక శ్రీశైలం రోడ్డులోని ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ముఖ్య అతిథుల చేతుల మీదిగా ప్రత్యేక పూజలు అనంతరం, బారీ డీజే మోతలు, చిన్నారుల కోలాట నృత్యాలు, డప్పు కళాకారుల జానపద నృత్యాలు నడుమ భారీ ర్యాలీ పట్టణ పురవీధుల నుంచి సభా వేదిక వద్దకు కదిలి వస్తుంది. బహిరంగ సభా అనంతరం మండాలాలు వారీగా భోజన ఏర్పాట్లు చేశారు.



విడివిడిగా భోజన ఏర్పాట్లు..!

కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభకు విచ్చేసే ప్రజలకు, పార్టీల శ్రేణులకు మండలాలు వారీగా విడివిడిగా భోజన ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. కారంపూడి,దుర్గి, రెంటచింతల మండలాలు వారకి, మాచర్ల పట్టణ నెహ్రూనగర్ వాసులకు స్థానిక వివిఎన్ గార్డెన్ నందు భోజనాలను సిద్ధం చేస్తున్నారు. అలానే వెల్దుర్తి, మాచర్ల మండలాలు కలిపి మాచర్ల పట్టణం వాసులకి స్థానిక మానుకొండ కళ్యాణ మండపంలో భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# వైన్ షాపుల అకస్మికతనికి.

## లిక్కర్ బాటిల్ తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ రవి.

వేమూరు(భట్టిప్రోలు) పెన్ పవర్,జూన్ 18 అక్రమ మద్యం విక్రయాలపై ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రవి పేర్కొన్నారు, గురువారం వేమూరు లో వైన్ షాపుల్లో అకస్మిక తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగావైన్ షాపుల్లో లిక్కర్ల బాటిల్ ని తనిఖీ చేశారు, ప్రభుత్వం ద్వారా అందించే బాటిల్లు తప్ప వేరే లిక్కర్ సీసాలు ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, అదేవిధంగా ప్రతి లిక్కర్ షాపుకు పర్మిట్ రూమ్ కేటాయించడం జరిగిందని లిక్కర్ వినియోగదారులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా పరిమిత షాపుల్లో మాత్రమే లిక్కర్ సేవించాలని సూచించారు, నిబంధనలు అధిక్రమించిన షాపులపై కేసులను నమోదు చేయడం జరుగుతుందని సీఐ రవి తెలియజేశారు, ఆయనతోపాటు ఎస్సై శ్రీరామ్ శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.



## 400 ఏళ్లైనా చెక్కు చెదరని చెక్క రాజభవనం.. ఎక్కడుందో తెలుసా?

పెన్ పవర్,జూన్ 18భారతదేశంలోని రాజభవనాల గురించి మాట్లాడితే చాలామందికి పాలరాతితో నిర్మించిన భారీ కట్టడాలు, ఎత్తైన రాతి కోటలే గుర్తుకొస్తాయి. అయితే దక్షిణాదిలో మాత్రం వీటికి పూర్తిగా భిన్నమైన ఓ అద్భుత రాజభవనం ఉంది. నాలుగు శతాబ్దాల చరిత్రను మోస్తున్న ఈ కట్టడాన్ని పూర్తిగా చెక్కతో నిర్మించారు. తమిళనాడులోని కన్యాకుమారి జిల్లాలో ఉన్న ఈ రాజభవనం పేరు పద్మనాభపురం ప్యాలెస్ 1601లో నిర్మించిన ఈ రాజభవనం ఒకప్పుడు ట్రావెన్‌కోర్ రాజ్యానికి పరిపాలనా కేంద్రంగా ఉండేది. 1795లో రాజధానిని తిరువనంతపురానికి మార్చే వరకు ఇక్కడి నుంచే పాలన సాగింది.

# రూ. 86.16 లక్షలతో దామరమడుగులో అభివృద్ధి.

## ఒక ఇంటి ఆడపడుచులా ఆదరిస్తున్న దామరమడుగు ప్రజలకు ధన్యవాదాలు..





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూన్ 18. దామరమడుగులో పలు అభివృద్ధి వనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.. కూటమిప్రభుత్వంఅభివృద్ధిలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని అందులో భాగంగా దామర మడుగు గ్రామంలో రూ. 86.16 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం దామర మరుగు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా గంగవరం కాలువ వద్ద ఉన్న కల్వర్టును ప్రారంభించి, దామరమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని మాతమ్మ తిరుణాల ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దామరమడుగు గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్,పాఠశాల అభివృద్ధి, సీసీ రోడ్లు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఎన్టీఆర్ కాలనీలో మౌలిక వసతులు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. దామర మడుగు ప్రజలు ఒక ఇంట్లో ఆడపడుచు లాగా ఆదరించి ఆశీర్వదిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో దామరమడుగులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కూ టమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువ క్రికెటర్ ఎల్లు హన్షిత్‌ను అభినందించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





నెల్లూరు రూరల్ (కోవూరు) పెన్ పవర్,జూన్ 18( పలనాడు జ్యోతి )జూన్ 18 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలం ఆలూరుపాడు గ్రామానికి చెందిన యువ క్రికెట్ క్రీడాకారుడు క్రికెట్ లో ఉన్నత శిఖారాలు అధిరోహించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు.నెల్లూరులోని వీ పీ ఆర్ కార్యాలయంలో కొడవలూరు మండలం ఆలూరుపాడుకు చెందిన యువ క్రికెట్ క్రీడాకారుడు ఎల్లు హన్షిత్‌ను కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు.ఇటీవల కాలంలో వై.ఎస్.పి.ఏ నిర్వహించిన క్రికెట్ పోటీల్లో హన్షిత్ ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తెచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో వై.ఎస్.పి.ఏ వారు నెల్లూరులో నిర్వహించిన అంతర్రాష్ట్ర అండర్-19 క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా తరఫున పాల్గొని, జాతీయ స్థాయికి ఎంపికవడమే కాకుండా గోల్డ్ మెడల్ (బంగారు పతకం) సాధించారు.అదే విధంగా, మే నెలలో జమ్మూ కాశ్మీర్‌లోని మౌలానా ఆజాద్ స్టేడియంలో వై ఎస్ పి ఏ వారు నిర్వహించిన జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున హన్షిత్ ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ (వెండి కప్) కైవసం చేసుకోవడంలో హన్షిత్ కీలక పాత్ర పోషించారు.ఈ నేపథ్యంలో హన్షిత్ ప్రతిభను గుర్తిస్తూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభినందించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.యువ క్రీడాకారులకు క్రీడల పట్ల ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కి క్రీడాకారుడు హన్షిత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే అందిస్తున్న సహాయ సహకారంతో తనలో మరింత బాధ్యతను, ఉత్సాహాన్ని నింపిందని హన్షిత్ పేర్కొన్నారు

# కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి పనులను ఎండోమెంట్ అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..

తూర్పు, పడమర గాలిగోపురాలు, భక్తుల మెట్లు,మౌలిక సదుపాయాల నిర్మాణ పురోగతిపై సమీక్ష..

భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి వసతులు, పార్కింగ్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి..

ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన నిధులు సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఎమ్మెల్యే హామీ..

భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం..





బోగోలు (మండలం)కొండ బిట్రగుంట, పెన్ పవర్,జూన్ 18 నెల్లూరు పలనాడు జ్యోతి నెల్లూరు జిల్లా,బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను గురువారం కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి పరిశీలించారు.ఎండోమెంట్ అధికారులు,ఆలయ అధికారులు,కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి దేవస్థానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న తూర్పు గాలిగోపురం, పడమర గాలిగోపురం, భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న మెట్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణ వేగం,భక్తులకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు..రోజురోజుకు పెరుగుతున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి వసతులు, రహదారి సౌకర్యాలు, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా ఈ ప్రాంతానికి గుర్తింపుగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, అవసరమైన నిధుల కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి చెందడం వల్ల జిల్లాలోని భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు కూడా మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ చీఫ్ ఇంజనీర్ శేఖర్ బాబు,ఎండోమెంట్ అధికారి తపతి,ఆలయ ఈవో రాధా

# గాయపడిన నాయకుడిని పరామర్శించిన బాలల హక్కుల కమిషన్ సభ్యుడు



బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, అనంతపురం, జూన్ 18: గుడిబండ మండలం పరిధిలో శంకరుగల్లు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఎస్కే హనుమంత రాయప్ప ఇటీవల పొలంలో పడిపోవడంతో కాలు విరగడం జరిగింది. ఈ సంఘటన తర్వాత ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఆయనను స్వయంగా పరామర్శించారు. హనుమంత రాయప్ప త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆయన ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. పరామర్శ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డి. శ్రీనాథ్ మూర్తి, డాక్టర్ కృష్ణమూర్తి, నాయకులు బాధిపల్లప్ప, జయరాం తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై హనుమంత రాయప్ప ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఈ పరామర్శ కార్యక్రమం గ్రామంలో చైతన్యాన్ని కలిగించింది. నాయకుల మధ్య అనుబంధం, ప్రజలతో ఉన్న సంబంధం మరింత బలపడేలా ఈ సందర్శన ఉపయోగపడిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# శ్రీ ఉమామహేశ్వర స్వయంభు దేవస్థానంలో ధ్వజస్తంభ -- నందీశ్వరుడు ప్రతిష్ట మహోత్సవంలో..ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి





నెల్లూరు పెన్ పవర్,జూన్ 18 నెల్లూరు జిల్లా,కావలి పట్టణం కొత్త బజార్ లోని శ్రీ శ్రీ శ్రీ ఉమామహేశ్వర స్వయంభు దేవస్థానంలో ధ్వజస్తంభం, నందీశ్వరుడు ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ పుణ్యకార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.దేవస్థానానికి విచ్చేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గారికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. పూర్ణకుంభ స్వాగతం, వేదాశీర్వచనాల నడుమ ఆలయ ప్రాంగణానికి ఆహ్వానించిన అనంతరం ప్రత్యేక సత్కారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ధ్వజస్తంభం, నందీశ్వరుడు ప్రతిష్ట కార్యక్రమాలను తిలకించి, ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఉమామహేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు కావలి నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆర్థికాభివృద్ధితో ముందుకు సాగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సామరస్యం, సన్మార్గాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు..

# కోడూరు లక్ష్మమ్మకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఘన నివాళి





బోగోలు మండలం పాత బంగారుపాలెం, పెన్ పవర్,జూన్ 18 నెల్లూరు పలనాడు జ్యోతి బోగోలు మండలం పాత బంగారు పాలానికి చెందిన కోడూరు లక్ష్మమ్మ ఇటీవల పరమపదించారు. గురువారం వారి స్వగృహంలో నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# రాయవరం సచివాలయంలో రైతులకు వరి విత్తనాల పంపిణీ

గూడూరు, పెన్ పవర్, జూన్ 18 గూడూరు మండలం రాయవరం గ్రామ సచివాలయం ఖరీఫ్ సీజన్ వరి సాగుకు అవసరమైన విత్తనాలను రాయవరం పిఎసిఎస్ చైర్మన్ కోలపల్లి రజిని మరియు నియోజకవర్గ తెలుగుయువతఅధ్యక్షుడు ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేశారు.విత్తనాలు పొందేందుకు రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ వివరాలతో సచివాలయానికి హాజరు కావాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా రైతులు ముందస్తుగా విత్తనాలు తీసుకుని సాగుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు నాణ్యమైన విత్తనాల వినియోగం ఎంతో కీలకమని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.




రైతులు ప్రభుత్వ సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విత్తనాలను పొందుతున్నారు.

# ప్రజల చెంతకు ఉచిత వైద్యం మంత్రి పెమ్మసాని

గుంటూరు, పెన్ పవర్, జూన్, 18, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల కోసం ఒక గొప్ప శుభపరిణామం చోటుచేసుకుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించిన అధునాతన మెడికల్ కేర్ వాహన కార్యక్రమంలో, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఒ నందిగామ నియోజకవర్గం పరిశీలకులు తాళ్ళ వెంకటేష్ యాదవ్ వారితో కలిసి పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య సేవ ప్రత్యేకతలు: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (హెచ్డీఫ్సీ బ్యాంకు ) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీస్సార్ ) నిధుల ద్వారా ఈ వాహనాన్ని సమకూర్చడం జరిగింది. ఈ మొబైల్ మెడికల్ వాహనం నేరుగా ప్రజల వద్దకే వెళ్తుంది. నెలకు సుమారు 1500 మంది రోగులకు దీని




ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందుతాయి. బాధితులకు ఎలాంటి ఖర్చు లేకుండా 14 రకాల వైద్య పరీక్షలను (మెడికల్ టెస్ట్స్ ) పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తారు. గుంటూరు పార్లమెంట్ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఈ అద్భుతమైన అవకాశాన్ని కల్పించిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కి అలాగే ఇందుకు సహకరించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాజమాన్యానికి (హెచ్డీఫ్సీ బ్యాంకు మానేజ్మెంట్ ) నా హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు

# అమరావతికి ట్రాఫిక్ ఫ్రీ జర్నీ.. నాలుగు లైన్లతో కొత్త ఆర్వోబీ..

**విజయవాడ, జూన్ 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వెళ్లేవారి కష్టాలు తొలగిపోనున్నాయి. మంగళగిరి నుంచి రాజధాని ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఇబ్బందిగా మారిన నిడమర్రు రైల్వే లెవెల్ క్రాసింగ్ సమస్యకు పరిష్కారం లభించింది. నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్ రాగా.. ఇవాళ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేష్‌లు శంకుస్థాపన చేశారు. రూ.142 కోట్లతో ఈ ఆర్వోబీని నిర్మించనున్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.గుంటూరు జిల్లా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల మంగళగిరి నుంచి అమరావతి, తాడికొండ వైపు రాకపోకలు కొనసాగించేవారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అక్కడ తరచూ గేటు మూయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ సమయంలో వాహన రాకపోకలు ఆగిపోవడంతో పాటుగా ప్రయాణ సమయం పెరగడం, అత్యవసర సేవలకు అంతరాయం ఎదురైంది. అలాగే మంగళగిరి దగ్గర ఉన్న క్రికెట్ స్టేడియానికి వెళ్లవారికి ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయం మంత్రి లోకేష్‌కు తెలియడంతో ఆయన చొరవ తీసుకుని ఆర్వోబీ కోసం రైల్వే అధికారులకు రిక్వెస్ట్ చేయడంతో మంజూరు చేశారు. ఈ ఆర్వోబీ పూర్తయితే అమరావతి, తాడికొండ, మంగళగిరి, నిడమర్రు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి. మంగళగిరి నుంచి నిడమర్రు, బేతపూడి, నీరుకొండ, కురగల్లు గ్రామాల ప్రజలకు ప్రమాయణ సమయం తగ్గుతుందని చెబుతున్నారు.నిడమర్రు ఆర్వోబీ 10 మీటర్ల ఎత్తు, 767.50 మీటర్లు పొడవు, 28 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్లుగా నిర్మించనున్నారు. రైల్వే లైన్ నుంచి మంగళగిరి వైపు 405.50 మీటర్లు, అమరాతి వైపు 362 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. ఆర్వోబీ నాలుగులైన్లుగా.. ప్రతి లైను 3.75 మీటర్లు.. గ్యారేజ్ వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాస్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్డు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.5ఐ2) 5.5 మీటర్ల వెడల్పు ఉంటుంది. రోడ్లతో కలిపి మొత్తం వంతెన వెడల్పు 28 మీటర్లు ఉంటుంది. నిడమర్రు ఆర్వోబీకి శంకుస్థాపన చేయడంతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం' మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

- మొదటి పేజీ తరువాయి

విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఈ ఘనత సాధించిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, అభ్యసన సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

**మౌలిక వసతులు, విద్యార్థి కిట్లపై ప్రత్యేక శ్రద్ధ**

రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని 430 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న 1,06,360 మంది విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదుపాయాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

**అనాథ పిల్లలకు 'తల్లికి వందనం' భరోసా**

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని, ఇందుకోసం వారి గార్డియన్ల వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో, ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, వారి ద్వారా పిల్లలకు చేరేలా చూడాలన్నారు.

అంతేకాకుండా, అనాథ పిల్లల పేరుపై బ్యాంకు ఖాతాలు తెరిచి, పథకం నిధులను నేరుగా జమ చేయాలని సూచించారు. వారి చదువు పూర్తయ్యాక ఆ మొత్తాన్ని వారు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ఇది వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా ఇస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

**అభ్యసన సామర్థ్యాల పెంపు, తెలుగు భాషకు ప్రాధాన్యం**

పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువమంది విద్యార్థులు గణితం, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో విఫలమవుతున్నారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన లోకేశ్, ఎట్టి పరిస్థితుల్లోనూ మాతృభాష తెలుగును విస్మరించవద్దని, ఈ విషయంలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఆయా సబ్జెక్టుల్లో బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు తరగతులు నిర్వహించాలన్నారు.ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి సీతారామరాజు, పోలవరం వంటి ప్రాంతాల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయుల లభ్యతను సమీక్షించి కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల హాజరు శాతం 95కి తగ్గకుండా, మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడకుండా చూడాలన్నారు.

**ఆధునికీకరణ, పారదర్శకత దిశగా అడుగులు**

తెలుగు అకాడమీ ముద్రించే పాఠ్యపుస్తకాలను ప్రజలకు సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా విక్రయించాలని మంత్రి ఆదేశించారు. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల అనుమతుల్లో అనవసర నిబంధనలను తొలగించాలని, అదే సమయంలో వారు నిర్ణయించిన ఫీజుల వివరాలను స్కూళ్ల బయట బోర్డులపై ప్రదర్శించడంతో పాటు పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని స్పష్టం చేశారు. హైస్కూలు విద్యార్థులకు త్వరగా క్రోమ్ బుక్స్‌తో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌లు అందించాలని కూడా మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేడర్‌ను పట్టించుకోని నేతలు.. లోకేష్ సీరియస్ వార్నింగ్!

**గుంటూరు జూన్ 18, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కేవలం ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ ఫేస్‌బుక్, ఎక్స్‌లలో పోస్టులు పెట్టినందుకే అర్ధరాత్రి వేళల్లో సీఐడీ, స్థానిక పోలీసులు ఇళ్లపై పడి అరెస్టులు చేసిన సంఘటనలు వందలాదిగా ఉన్నాయి. మరీ దారుణంగా, కేవలం రాజకీయంగా అణచివేయాలనే ఏకైక లక్ష్యంతో సోషల్ మీడియా ఐటీ చట్టాల కింద కాకుండా, జీవితాలను నాశనం చేసేలా గంజాయి రవాణా, రేప్ కేసులు, హత్యాయత్నం వంటి తీవ్రమైన నాన్-బెయిలబుల్ అక్రమ కేసులను టీడీపీ కేడర్‌పై అక్రమంగా బనాయించారు. దీంతో ఎంతోమంది యువకులు, పార్టీ సానుభూతిపరులు కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర మానసిక, ఆర్థిక నష్టాన్ని చవిచూశారు.టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమపై ఉన్న అక్రమ కేసులు తక్షణమే రద్దవుతాయని వేలాది మంది కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం కూడా ప్రాథమికంగా బాధితుల వివరాలతో కూడిన లిస్టులను సేకరించింది. అయితే, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పగ్గాలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటికీ అందరిపై కేసులు ఎత్తివేసే ప్రక్రియ పూర్తిస్థాయిలో కొలిక్కి రాలేదు. తాజాగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, ఎమ్మెల్యేలతో జరిపిన అంతర్గత సమీక్షా సమావేశాలలో మాట్లాడిన మాటలను బట్టి క్షేత్రస్థాయిలో కేడర్ ఇప్పటికీ ఈ అక్రమ కేసుల వల్ల ఇబ్బందులు పడుతోందనే చేదు నిజం స్పష్టమయింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాల్లో కొంతమంది ఎమ్మెల్యేలు, కీలక నేతలు తమ సొంత పనుల్లో, అధికారిక హోదాల్లో బిజీ అయిపోయి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ కోసం లాఠీ దెబ్బలు తిని, జైలుపాలైన నిఖార్సైన కార్యకర్తలను విస్మరించారనే అసంతృప్తి పార్టీలో వ్యక్తమవుతోంది. ఈ క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్‌పై నారా లోకేష్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను కాపాడుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, వెంటనే వారందరికీ న్యాయ సహాయం అందించి కేసుల నుంచి విముక్తి కల్పించే బాధ్యతను స్థానిక నేతలే తీసుకోవాలని ఆయన గట్టిగా హెచ్చరించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.ఇప్పటికైనా ప్రభుత్వం , టీడీపీ అధిష్టానం కేవలం సాధారణ ఆదేశాలకే పరిమితం కాకుండా, ఒక స్పెషల్ లీగల్ సెల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లు, కోర్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త కేసుకు సంబంధించిన డేటాను క్రోడీకరించి, చట్టపరమైన లూప్‌హోల్స్‌ను తొలగిస్తూ హోంశాఖ ద్వారా జీవోలు జారీ చేసి కేసులను మాఫీ చేయించాలి. ఐదేళ్లపాటు సర్వస్వం కోల్పోయి పోరాడిన కేడర్‌తో నిరంతరం టచ్‌లో ఉంటూ, వారిపై ఉన్న అక్రమ కేసుల మరకలను త్వరితగతిన తుడిచివేసినప్పుడే.. భవిష్యత్తులో పార్టీ కోసం పని చేసే కార్యకర్తల్లో నమ్మకం, ధైర్యం నిలుస్తాయి.

## ఉత్తరాంధ్ర టూ ప్రకాశం.. విచిత్రమైన సైలెన్స్!

**ఒంగోలు, జూన్ 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన సీనియర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల విచిత్రమైన మౌన వ్రతం ఇప్పుడు అటు పార్టీ కేడర్‌లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ప్రజా సమస్యలపై పోరాడుతూ లైమ్‌లైట్‌లో ఉండేందుకు నేతలు ప్రయత్నిస్తుంటారు. కానీ, వైసీపీకి చెందిన అత్యధిక శాతం మంది మాజీ ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ఇటు అసెంబ్లీ వ్యవహారాలకు, అటు మీడియా ప్రెస్ మీట్లకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. కనీసం సొంత నియోజకవర్గాల్లో కేసులు, వేధింపులు ఎదుర్కొంటున్న కిందిస్థాయి కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకోవడం లేదా బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు షిఫ్ట్ అయిపోయారు. రెండేళ్లవుతున్నా మెరుపు తీగల్లా వచ్చి పోతున్నారు.ముఖ్యంగా ఉత్తరాంధ్ర , ప్రకాశం జిల్లాల పరిధిలోని కొందరు బడా మాజీ ఎమ్మెల్యేల ప్రవర్తన ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. గత ప్రభుత్వంలో మంత్రులుగా, జిల్లాలు ఏలిన కీలక నేతలుగా వెలిగిన వారు సైతం ఇప్పుడు నియోజకవర్గాల్లో గడప దాటడం లేదు. ప్రకాశం జిల్లాకు చెందిన ఒక సీనియర్ మాజీ కాకతాళీయంగా తన వ్యాపారాలన్నీ బెంగళూరుకు మార్చేసుకుని అక్కడే సెటిల్ అవ్వగా.. ఉత్తరాంధ్రకు చెందిన మరో ఇద్దరు కీలక నేతలు కనీసం స్థానిక పార్టీ ఆఫీసు వైపు కూడా చూడటం లేదు. ఐదేళ్ల పాటు హడావుడి చేసిన ఈ లీడర్లు హఠాత్తుగా ఇంతలా సైలెంట్ అయిపోవడం వెనుక కేవలం భయం మాత్రమే లేదు.. అంతకుమించిన పొలిటికల్ ప్లాన్ ఉందనే చర్చ నడుస్తోంది.పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్న అంతర్గత సమాచారం ప్రకారం.. ఈ మౌనం వెనుక అసలు కారణం కూటమి పార్టీల్లోకి జంప్ అయ్యేందుకు నడుస్తున్న గ్రౌండ్ వర్క్. గత హయాంలో తాము చేసిన కొన్ని వివాదాస్పద నిర్ణయాలు, ఆర్థిక లావాదేవీలపై ప్రస్తుత ప్రభుత్వం విచారణలు జరుపుతుండటంతో.. లీగల్ చిక్కుల నుండి ఎలాగైనా బయటపడాలని వీరు భావిస్తున్నారు. అందుకే, జగన్ రెడ్డి ఇచ్చే పిలుపులకు గానీ, తాడేపల్లి నుంచి వచ్చే ఆదేశాలకు గానీ స్పందించకుండా.. తాము వైకాపాకు దూరంగా ఉంటున్నామనే సంకేతాలను కూటమి పెద్దలకు పంపిస్తున్నారు.

# గుంటూరు మిర్చికి చైనా షాక్



**గుంటూరు, జూన్ 18, పెన్ పవర్:** మనదేశంలో మిరప ఎక్కువగా పండించే రాష్ట్రాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉంటాయి. ఇక్కడ పండే మిరపకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా టమాటా మిర్చి.. తేజ రకం మిర్చికి ఈ రెండు రాష్ట్రాలు పెట్టింది పేరు. అందువల్లే చైనా వ్యాపారులు మన తెలుగు రాష్ట్రాలలో పండిన మిరపకాయలను ఎక్కువగా కొనుగోలు చేస్తూ ఉంటారు. ఎండు మిరపకాయల నుంచి కారం మాత్రమే కాకుండా.. కృత్రిమ రంగులలో ఉపయోగించే రసాయనాలను తయారు చేస్తూ ఉంటారు. ఈ రసాయనాలకు చైనాలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది.సాధారణంగా మిర్చిలో రైతులు ఎక్కువగా క్రిమిసంహారకాలు వాడుతుంటారు. మిరప అనేది అత్యంత సున్నితమైన పంట. ఎక్కువ దిగుబడి సాధించడానికి రైతులు విపరీతంగా క్రిమిసంహారకాలు వాడుతూ ఉంటారు. గతంలో క్రిమిసంహారకాల వాడకం ఒక స్థాయి వరకు ఉండేది. కొంతకాలంగా మిరప మీద తెగుళ్లు విపరీతంగా దాడి చేస్తున్న నేపథ్యంలో దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. అందువల్ల రైతులు క్రిమిసంహారకాలను ఎక్కువగా వాడాల్సి వస్తోంది. దేశీయంగా పెద్దగా ఇబ్బందులు లేకపోయినప్పటికీ.. ఎగుమతి అయ్యే మిరప విషయంలోనే కష్టాలు ఎదురవుతున్నాయి.మన దగ్గర పండిన మిర్చి ఎక్కువగా చైనా దేశానికి ఎగుమతి అవుతూ ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో రెండు కంటైనర్ల మిర్చి మన దేశానికి చైనా తిరిగి పంపింది. దీనికి ప్రధాన కారణం క్రిమిసంహారకాలు అధికంగా ఉండటమే. ఈ స్థాయిలో క్రిమి సంహారకాలు వాడిన మిరపని పంపిస్తే తీసుకునేది లేదని చైనా స్పష్టం చేసింది. దీంతో మిరప వ్యాపారులు ఆందోళన చెపుతున్నారు. మిరపలో క్రిమిసంహారకాల వాడకాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని.. రైతులు సహజ సిద్ధమైన పద్ధతుల్లో మిరపని పండించే విధంగా చూడాలని వ్యాపారుడు కోరారు. పదేపదే పురుగుమందుల అవశేషాల ఉల్లంఘన జరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో భారత మార్కెట్ విలువ పడిపోతుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చైనాకు ఎగుమతి అవుతున్న మిరపలో మెతా మెడోఫాస్.. మోనోక్రోటఫాస్.. ప్రొఫెనోపాస్.. ట్రయాజో పాస్.. ఇతియాన్.. క్లోరోపైరీఫాస్.. పిఫ్రోనిల్ వంటి ఆందోళన కలిగించే క్రిమిసంహారకాలు ఉన్నాయని ఆంధ్ర ప్రదేశ్ మిరప వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు.. ప్రధాన కార్యదర్శి తోట రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. చైనా ప్రధానంగా ఈ క్రిమిసంహారకాలను చూపించి ఎగుమతులను తీసుకోవడం లేదని వారు పేర్కొన్నారు.. అంతేకాదు ప్రభుత్వం ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని.. రైతులకు మేలైన విత్తనాలు.. పంట దిగుబడిలో తీసుకోవాల్సిన సూచనలు.. తెగుళ్ల బారిన పడకుండా మేలైన దిగుబడి అందించే వంగడాలను రూపొందించాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.రైతులకు పురుగుమందులు అమ్మే డీలర్ల మీద కఠినమైన పర్యవేక్షణ కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు.. గుంటూరు.. పల్నాడు.. ప్రకాశం.. కర్నూలు.. నంద్యాల.. తెలంగాణ.. కర్ణాటక వంటి రాష్ట్రాలలో మిరప పండించే రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని మిరప వ్యాపారులు చెబుతున్నారు. సక్రమంగా ఎగుమతులు చేయని పక్షంలో దేశీయంగా రేటు పడిపోతుందని.. అది రైతులకే నష్టం చేకూరుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

# ఏపీలో ఆపరేషన్ ఆకర్ష్...

**విజయవాడ, జూన్ 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలన మార్పులకు తెరలేవబోతోంది. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఒక వ్యూహం ప్రకారం వాయిదా వేస్తూ వచ్చిన రాజకీయ చేరికల ప్రక్రియకు ఇప్పుడు గేట్లు ఎత్తడానికి ముహూర్తం ఖరారైనట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూటమి బాట పట్టడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో.. ఈ చేరికలను క్రమబద్ధీకరించడానికి కూటమి పార్టీలు ప్రత్యేక వ్యవస్థలను సిద్ధం చేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విచ్చలవిడిగా చేరికలను ప్రోత్సహించకుండా ఒక పద్ధతి ప్రకారం ఆలస్యం చేస్తూ వస్తున్నారు. ఎన్నికల ముగిసిన వెంటనే కొంతమందికి మాత్రమే ఎంట్రీ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత చేరికలకు బ్రేకులు వేశారు. దీని వెనుక ప్రభుత్వ స్థిరత్వం, సొంత పార్టీల క్యాడర్‌లో అసంతృప్తి రాకుండా చూసుకోవాలనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల సుదీర్ఘ వ్యూహం ఉంది. అయితే, ప్రస్తుతం వైసిపిలో యాక్టివ్ గా లేని, ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామా చేసి గోడ మీద పిల్లిలా ఉన్న సీనియర్ల సంఖ్య పెరిగిపోవడంతో, వారిని ఎక్కువ కాలం వెయిటింగ్‌లో ఉంచడం కంటే పార్టీల్లోకి ఆహ్వానించడమే శ్రేయస్కరమనే భావనకు కూటమి నేతలు వచ్చారు.చేరికలు ఒకరి పార్టీలోకి మరొకరు దూకడం వల్ల కూటమిలో అంతర్గత కలహాలు రాకుండా ఉండేందుకు ప్రత్యేక ఫిల్టరింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇతర పార్టీల నుంచి వచ్చే నేతల స్క్రీనింగ్ కోసం, చేరికల ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక కమిటీని రంగంలోకి దించారు. తెలుగుదేశం పార్టీలో చేరికలను సమీక్షించడానికి, స్థానిక నేతల అభ్యంతరాలను పరిష్కరించడానికి ఎప్పటి నుంచో ఒక ప్రత్యేక విభాగం అంతర్గతంగా పనిచేస్తోంది. టీడీపీ-జనసేన-బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు లేదా క్షేత్రస్థాయి సమన్వయం దెబ్బతినకుండా, ఏ నేత ఏ పార్టీలో చేరితే సామాజికంగా, రాజకీయంగా లబ్ధి చేకూరుతుందో తేల్చేందుకు కూటమి తరఫున ఒక కో-ఆర్డినేషన్ కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది.ఇంతకాలం చేరికలపై వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం స్థానికంగా ఉన్న లీడర్ల మధ్య టికెట్ల లొల్లి వస్తుందనే భయం. ఒక నియోజకవర్గంలో ఇప్పటికే కూటమి ఎమ్మెల్యే ఉన్నప్పుడు, వైసిపి నుంచి వచ్చే సీనియర్‌కు వచ్చే ఎన్నికల్లో సీటు ఎలా ఇస్తారు? అనే ప్రశ్న తలెత్తింది. అయితే, కేంద్ర ప్రభుత్వం త్వరలోనే డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టడం ఖాయమనే సంకేతాలు స్పష్టంగా రావడం ఇక్కడ గేమ్ ఛేంజర్‌గా మారింది. వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందనే భరోసా రావడంతో, కొత్తగా వచ్చే నేతలకు కూడా భవిష్యత్తులో సీట్లు సర్దుబాటు చేయవచ్చనే ధీమాతో కూటమి అగ్రనేతలు గేట్లు ఎత్తడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ విడత చేరికల్లో ఉత్తరాంధ్ర తో పాటు కోస్తా తీరం వెంబడి నెల్లూరు జిల్లా వరకు ఉన్న వైసిపికి చెందిన కనీసం 15 నుండి 20 మంది కీలక నేతలు క్యూ కట్టబోతున్నారు. రాయలసీమలోనూ పట్టున్న కొందరు రెడ్డి సామాజికవర్గ నేతలు కూడా కూటమితో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వైసిపి అధినాయకత్వం వైఖరిపై నమ్మకం కోల్పోవడం, క్షేత్రస్థాయిలో క్యాడర్ మొత్తం కూటమి వైపు షిఫ్ట్ అయిపోవడంతో, తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి వీరంతా లగేజ్ సర్దుకుంటున్నట్లుగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు అత్యంత కీలకం. గత ఎన్నికల ఫలితాలు నిరూపించింది ఏంటంటే.. టీడీపీ - జనసేన కలిసి ఉన్నంత కాలం వైసిపి గెలవడం అసాధ్యం. ఇదే విషయాన్ని వైసీపీ నేతలు కూడా చెబుతూ వస్తున్నారు. ఈ కూటమి కనీసం మరో రెండు దశాబ్దాల పాటు బలంగా కొనసాగుతుందనే నమ్మకం రాజకీయ నాయకుల్లో ఏర్పడింది. ఎప్పటికీ అధికారంలోకి రాలేని పార్టీలో ఉండి సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే, పవర్ సెంటర్‌గా మారిన కూటమిలో భాగమవ్వడమే సరైన మార్గమని వైసిపి నేతలు భావిస్తున్నారు. ఈ చేరికల తుఫాను కేవలం వైసిపిని మరింత బలహీనపరచడానికే కాకుండా.. కూటమిలోని అంతర్గత బలాబలాలను మార్చడానికి కూడా ఉపయోగపడనుంది. పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా జనసేన గ్రాఫ్ మరింత పెరిగేలా బలమైన సామాజికవర్గ నేతలను ఆకర్షించే అవకాశం ఉంది, తద్వారా రాబోయే రోజుల్లో టీడీపీకి సమానంగా లేదా బలమైన ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే వ్యూహం ఇందులో కనిపిస్తోంది. మొత్తానికి, ఏపీలో రాబోయే కొన్ని వారాలు సరికొత్త రాజకీయ వలసలకు వేదిక కానున్నాయి.

**జనసేనలో జాయినింగ్ కమిటీ**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీని సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. తనకు బలమైన నాయకత్వం కావాలని ఆయన భావిస్తున్నారు. జనసేన ఇప్పటి వరకూ కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే బలంగా ఉంది. రాష్ట్రంలో అధిక శాతం జనసేన విస్తరించాలంటే అందుకు సరైన నాయకత్వం అవసరమని భావిస్తున్నారు. అందుకే పవన్ కల్యాణ్ తాజాగా కీలక నిర్ణయం నిర్ణయం తీసుకున్నారు.జనసేనలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేశారు. 14 మంది సభ్యులతో 'ఏపీ జనసేన కమిటీ' ఏర్పాటు చేశారు. త్వరలో ఏపీ తరహాలోనే తెలంగాణలో జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రకటించారు. అంటే చేరికలకు పవన్ కల్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే కనిపిస్తుంది.అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య వంటి వారిని పార్టీలోకి తీసుకున్నారు వారంతా వైసీపీ నుంచి వచ్చిన వారే. నియోజకవర్గాల్లో బలమైన నేతలు. ఇక వైసీపీ నుంచి వచ్చే వారికి కూడా పవన్ కల్యాణ్ ఒకరకంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కనపడుతుంది. దీంతో రెండు లక్ష్యాలు నెరవేరుతాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. మొదటిది జనసేనకు బలమైన నాయకత్వం ఏర్పాటు కావడం. రెండోది వైసీపీని బలహీనపర్చడం. వైసీపీలో ఉన్న బలమైన నేతలు వస్తామంటే తీసుకునేందుకు పవన్ కల్యాన్ సిద్ధం అని ఈ నిర్ణయం తో స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇప్పటి వరకూ జనసేనలో చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నా పవన్ కల్యాణ్ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.ఇందుకోసం పద్నాలుగు మందితో ప్రత్యేకంగా కమిటీని నియమించడం వెనక కూడా పవన్ కల్యాణ్ ఒక వ్యూహం ప్రకారం ముందుకు వెళుతున్నారని అనిపిస్తుంది. ఎందుకంటే వైసీపీ, టీడీపీ, బీజేపీ ఏ పార్టీ నుంచి వచ్చినా చేర్చుకోవాలంటే ముందు ఈ కమిటీ ఒకే అంటేనే తర్వాత పవన్ కల్యాణ్ అనుమతి కోసం వెళ్లాల్సి ఉంటుంది. కమిటీ అన్ని రకాలుగా పరిశీలించి నేతల చేరికపై పవన్ కల్యాణ్ కు నివేదిక ఇచ్చిన తర్వాత మాత్రమే జనసేన పార్టీ కండువా కప్పుతారు. కోస్తాంధ్రతో పాటు రాయలసీమ నుంచి కూడా జనసేనలో పెద్దయెత్తున నేతలను అంటే నియోజకవర్గ స్థాయిలో బలమైన లీడర్లను చేర్చుకుంటే వచ్చే ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి బలమైన పార్టీగా అవతరించాలన్న వ్యూహంతోనే చేరికలకు పవన్ ఈ స్ట్రాటజీని అమలు చేస్తున్నట్లు అనిపిస్తుంది. మరి ఏ పార్టీ నుంచి చేరతారన్నది చూడాల్సిందే.

# ఇషాన్ ప్రత్యేకత అదే.. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ స్వాన్ ప్రశంసలు

- ఆఫ్ఘన్‌పై రెండో వన్డేలో సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్
- 79 బంతుల్లో 125 పరుగులు.. 14 ఫోర్లు, 7 సిక్సర్లతో వీరవిహారం
- శుభ్‌మన్ గిల్‌తో కలిసి 224 పరుగుల భాగస్వామ్యం
- జట్టులో ఏ పాత్ర ఇచ్చినా పోషిస్తాడన్న గ్రేమ్ స్వాన్
- అసలు గ్యాప్ లేనట్లు ఆడాడని ప్రశంస
- బలహీనతను బలంగా మార్చుకున్నాడని వ్యాఖ్య




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్థాన్‌తో లక్నో వేదికగా జరిగిన రెండో వన్డేలో ఇషాన్ కిషన్ ఆడిన అద్భుత ఇన్నింగ్స్‌పై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ ప్రశంసలు కురిపించాడు. జట్టులోకి పునరాగమనం చేసినా.. అసలు ఏమాత్రం గ్యాప్ లేదన్నట్లుగా ఆడిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నాడు.
ఈ మ్యాచ్‌లో ఇషాన్ కేవలం 79 బంతుల్లోనే 125 పరుగులు చేసి భారత భారీ విజయానికి పునాది వేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (154)తో కలిసి మూడో వికెట్‌కు 224 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఆఫ్ఘన్ బౌలర్లను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టాడు. జియోస్టార్‌తో మాట్లాడిన స్వాన్.. ఇషాన్ జట్టుకు అవసరమైన పాత్రను ఎలాంటి అభ్యంతరం లేకుండా పోషిస్తాడని చెప్పాడు. "అతడికి ఏ బాధ్యత అప్పగించినా అంగీకరిస్తాడు. తిరిగి జట్టులోకి వచ్చి ఇంత ప్రభావం చూపడం నిజంగా గొప్ప విషయం" అని వ్యాఖ్యానించాడు. ఇషాన్ ఇన్నింగ్స్ నిర్మించిన తీరు తనను మరింత ఆకట్టుకుందని స్వాన్ తెలిపాడు. తొలి అర్ధశతకాన్ని ఓపిగ్గా ఆడిన అతడు తర్వాత కేవలం 19 బంతుల్లోనే మరో 50 పరుగులు చేసి సెంచరీ పూర్తి చేయడం అసాధారణమని అన్నాడు. అయితే అవి నిర్లక్ష్యంగా కొట్టిన షాట్లు కాదని, బౌలర్లపై ఒత్తిడి పెంచుతూ సరైన బంతులను మాత్రమే బౌండరీలకు తరలించాడని వివరించాడు. తన బలహీనతలపై ఇషాన్ కష్టపడి పనిచేసి వాటినే బలంగా మార్చుకున్నాడని స్వాన్ ప్రశంసించాడు. అదే అతణ్ని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతోందని పేర్కొన్నాడు.
ఇషాన్-గిల్ జోడీ చెలరేగడంతో భారత్ 402 పరుగుల భారీ స్కోరు సాధించిన విషయం తెలిసిందే. అనంతరం భారత బౌలర్లు ఆఫ్ఘనిస్థాన్‌ను 232 పరుగులకే ఆలౌట్ చేసి 170 పరుగుల తేడాతో విజయం సాధించారు. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది.

# క్రిస్టియానో రొనాల్డోపై విమర్శలు... మూడేళ్ల క్రితమే కోహ్లీ ఏం చెప్పాడంటే..!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ 2026లో పోర్చుగల్ ప్రయాణం నిరాశాజనకంగా ప్రారంభమైంది. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోతో జరిగిన తొలి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్ తర్వాత ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడైన 41 ఏళ్ల క్రిస్టియానో రొనాల్డోపై విమర్శల వర్షం కురుస్తోంది. పోర్చుగల్ జట్టుకు నాయకత్వం వహిస్తున్న రొనాల్డో, తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక నీరసంగా కనిపించాడు. అంతర్జాతీయంగా 143 గోల్స్ చేసి రికార్డు సృష్టించిన ఈ దిగ్గజం ఆటతీరుపై ఒక్క మ్యాచ్‌తోనే పండితులు, అభిమానులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు అతడిని జట్టులోకి ఎందుకు ఎంపిక చేశారనే స్థాయికి చర్చ చేరింది. ఈ తీవ్రమైన విమర్శల నేపథ్యంలో భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీ గతంలో రొనాల్డో గురించి చెప్పిన మాటలు ఇప్పుడు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సరిగ్గా ఇలాంటి విమర్శలనే తన కెరీర్‌లో ఎదుర్కొన్న కోహ్లీ, రొనాల్డో విషయంలో ప్రపంచాన్ని హెచ్చరిస్తూ పలు సందర్భాల్లో తన అభిమానాన్ని, మద్దతును చాటుకున్నాడు. 2022లో ఖతార్ ప్రపంచకప్ నుంచి పోర్చుగల్ నిష్క్రమించినప్పుడు రొనాల్డో కన్నీటి పర్యంతమవ్వగా, కోహ్లీ స్ఫూర్తిదాయక సందేశాన్ని పోస్ట్ చేశాడు. "ఏ ట్రోఫీ లేదా టైటిల్ కూడా ఈ క్రీడకు మీరు చేసిన సేవను, ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులపై మీరు చూపిన ప్రభావాన్ని తగ్గించలేదు. ప్రజలు మిమ్మల్ని చూసినప్పుడు పొందే అనుభూతిని ఏ టైటిల్ వివరించలేదు. అది దేవుడిచ్చిన వరం. ప్రతిసారీ తన పూర్తిస్థాయిలో హృదయంతో ఆడే వ్యక్తికి ఇది నిజమైన ఆశీర్వాదం. క్రీడాకారులందరికీ మీరు నిజమైన స్ఫూర్తి. నా దృష్టిలో మీరే ఆల్ టైమ్ గ్రేటెస్ట్ ప్లేయర్" అని కోహ్లీ పేర్కొన్నాడు. అంతేగాక 2023లో రియాద్ ఆల్-స్టార్స్ తరఫున ఆడిన రొనాల్డో.. మెస్సీ, నెయ్‌మార్, ఎంబాపె వంటి స్టార్లు ఉన్న పీఎస్‌జీ జట్టుపై రెండు గోల్స్ చేశాడు. అప్పుడు కూడా కోహ్లీ స్పందిస్తూ.. "ఇప్పటికీ 38 ఏళ్ల వయసులో అత్యున్నత స్థాయిలో ఆడుతున్నాడు. ప్రతి వారం అటెన్షన్ కోసం అతడిని విమర్శించే నిపుణులు ఇప్పుడు మౌనంగా ఉన్నారు. ప్రపంచంలోని టాప్ క్లబ్‌లలో ఒకదానిపై ఇలాంటి ప్రదర్శన చేసిన తర్వాత కూడా మాట్లాడరేం. అతడు ముగిసిపోయాడన్నారు కదా?" అని విమర్శకులకు చురకలు అంటించాడు.
రొనాల్డో మాంచెస్టర్ యునైటెడ్, రియల్ మాడ్రిడ్ లేదా జువెంటస్‌లో ఉన్నప్పటి ఆటగాడు కాదనేది వాస్తవం. కానీ, 2025-26 సీజన్‌లో అల్-నసర్ తరఫున 30 మ్యాచ్‌లలో 28 గోల్స్ చేశాడనే విషయాన్ని విమర్శకులు విస్మరిస్తున్నారు. ప్రస్తుతం అతని సమస్య సామర్థ్యం కాదు, వేగవంతమైన యూరోపియన్ లీగ్‌లలో ఆడే సహచరులతో సరైన సమన్వయం లేకపోవడమే. రొనాల్డో, కోహ్లీ ఇద్దరూ తమ కెరీర్‌లో ఇలాంటి విమర్శలను ఎదుర్కొని, తమ ఆటతోనే సమాధానం చెప్పినవారే. కోహ్లీ ఎలాగైతే విమర్శలను తిప్పికొట్టి తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడో, రొనాల్డో కూడా తనపై వచ్చే ప్రతి విమర్శను ఒక సవాలుగా తీసుకుని, రాబోయే మ్యాచ్‌లలో తనదైన శైలిలో చెలరేగి, విమర్శకుల నోళ్లు మూయిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.

## 2027లో కాస్త ముందుగానే ఐపీఎల్ సీజన్.. మ్యాచ్?లు పెంచే అవకాశం లేనట్లే !



**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఐపీఎల్ సీజన్ కాస్త ముందుగానే ప్రారంభం కానుంది. తొందరగా స్టార్ట్ చేసి తొందరగా ఎండ్ చేసేందుకు బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. దీంతో సమ్మర్ లో క్రికెట్ కిక్కు ఫ్యాన్స్ కు ఎర్లీగానే మొదలవనుంది. ఐపీఎల్ 2027 షెడ్యూల్ గురించి బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా కీలక విషయాలు వెల్లడించారు. ఫ్యూచర్ ఎడిషన్‌లను మార్చి 10న ప్రారంభించి మే 15వ తేదీ నాటికి ముగించేందుకు బీసీసీఐ పరిశీలిస్తోందని ఆయన తెలిపారు. సమ్మర్ కారణంగా ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ చివరి దశలో తీవ్రమైన ఎండలు ఉండటంతో మ్యాచ్ లను ముందుగానే ప్రారంభించే ప్లాన్ చేస్తున్నారు. మే నెలాఖరులో ఎండలు తీవ్రంగా ఉండటం.. అలాగే ఐపీఎల్ రెండు నెలల గ్యాప్ లో ఇంటరనేషన్ క్రికెట్ క్యాలెండర్‌ను సర్దుబాటు చేయాలంటే సవాళ్లు ఎదురవుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది (2026) ఐపీఎల్ మార్చి 29 (28) తేదీలలో మొదలై, మే 31 నాటికి ముగిసింది. మే 15 తర్వాత టోర్నమెంట్ చివరి దశలో వర్షాలు కురిసే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని చర్చలు జరుపుతున్నాం. అటు తీవ్ర ఎండలు, ఇటు వర్షాల నుంచి తప్పించుకుని.. షెడ్యూల్ ను ముందుగానే ముగించాలని ప్లాన్ లో ఉన్నట్లు చెప్పారు.

**74 నుంచి 94 పెంచడం కష్టమే..**

లీగ్‌ను పెంచాలని సూచనలు వస్తున్నప్పటికీ, ఇంటర్నేషనల్ షెడ్యూలింగ్ పరిమితుల కారణంగా మ్యాచ్ లను పెంచడం కష్టమేనని అన్నారు. ఫ్యూచర్ లో మ్యాచ్‌ల సంఖ్యను 74 నుండి 94కు పెంచే అవకాశం లేదని స్పష్టం చేశారు.

# జక్కన్న టేబుల్ ప్రాఫిట్.. ఈసారి కెరీర్ లోనే టాప్?







దర్శకధీరుడు రాజమౌళి సినిమా అంటే ఆడియన్స్ లో ఎంత క్రేజ్ ఉంటుందో, ట్రేడ్ వర్గాల్లో కూడా అంతే నమ్మకం ఉంటుంది. ఆయన సినిమా విడుదలకు ముందే డీల్స్ ద్వారా భారీ బిజినెస్ జరగడం కొత్త విషయం కాదు. అయితే ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబుతో తెరకెక్కిస్తున్న వారణాసి విషయంలో ఆ రేంజ్ మరింత పెరిగే అవకాశం ఉందని ఇప్పుడు చర్చ జరుగుతోంది. అయితే సినీ ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు వినిపించే పదం టేబుల్ ప్రాఫిట్. అంటే మూవీ ప్రొడక్షన్ కు అయిన ఖర్చు కంటే, విడుదలకు ముందే థియేట్రికల్, డిజిటల్, శాటిలైట్, మ్యూజిక్ రైట్స్ ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటే నిర్మాతలు ముందుగానే లాభాల్లోకి వెళ్లినట్లే. అలాంటి సిచ్యువేషన్ నే టేబుల్ ప్రాఫిట్ గా ట్రీట్ చేస్తారు. రాజమౌళి కెరీర్ ను పరిశీలిస్తే ఆ ట్రెండ్ చాలా కాలంగా కనిపిస్తోంది.
ఆయన కెరీర్ స్టార్టింగ్ నుంచి బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లలో మంచి నమ్మకం ఏర్పడింది. వరుస విజయాలతో ఆ నమ్మకం మరింత బలపడింది. దీంతో ప్రతి కొత్త సినిమాకు గత చిత్రం కంటే ఎక్కువ బిజినెస్ జరగడం కామన్ అయిపోయింది. మగధీర, ఈగ వంటి చిత్రాల సమయంలో రాజమౌళి మార్కెట్ బాగా పెరిగింది. ఆ తర్వాత వచ్చిన బాహుబలి సిరీస్ ఇండియన్ సినిమా మార్కెట్ ను పూర్తిగా మార్చేసింది. ముఖ్యంగా బాహుబలి 2 విడుదలకు ముందే రైట్స్ రూపంలో భారీ ఆదాయం సాధించింది. ఆ సినిమా తర్వాత రాజమౌళి బ్రాండ్ వాల్యూ ఇంటర్నేషనల్ లెవెల్ కు చేరుకుంది. ఆర్ఆర్ఆర్ మూవీతో ఆ క్రేజ్ మరోసారి రుజువైంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర లాంగ్వేజెస్, ఓవర్సీస్ మార్కెట్లలో కూడా ఆ చిత్రానికి భారీ డిమాండ్ కనిపించింది. డిజిటల్, శాటిలైట్, థియేట్రికల్ రైట్స్ ద్వారా విడుదలకు ముందే పెద్ద మొత్తంలో బిజినెస్ జరిగింది. ఇప్పుడు అదే అంచనాలు వారణాసిపై కనిపిస్తున్నాయి. మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ఆ సినిమా ఇప్పటికే పాన్ ఇండియా రేంజ్ లో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. అఫీషియల్ గా కంప్లీట్ బిజినెస్ డిటైల్స్ బయటకు రాకపోయినా, ఓటీటీ రైట్స్ కోసం బడా ప్లాట్ ఫామ్స్ ఆసక్తి చూపుతున్నాయనే ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. మేకర్స్ ఒక్క ఓటీటీ డీల్ ద్వారానే రూ.500 కోట్లు ఆశిస్తున్నట్లు వినికిడి. అయితే వారణాసి బడ్జెట్ రూ.1000 కోట్ల రేంజ్ లో ఉండొచ్చని ఇప్పటికే వార్తలు వచ్చాయి. దీంతో ఓటీటీ డీల్ వాల్యూ రూ.500 కోట్లు అయితే.. మిగతా డీల్స్ తోనూ పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయి. దీంతో రాజమౌళి బ్రాండ్, మహేష్ బాబు స్టార్ డమ్ కలిసి రావడంతో విడుదలకు ముందే రికార్డు లెవెల్ బిజినెస్ జరిగి.. భారీ టేబుల్ ప్రాఫిట్ తీసుకురావచ్చనే అంచనాలు ఉన్నాయి. అదే సమయంలో గతంలో రాజమౌళి సినిమాలు సాధించిన బిజినెస్ రికార్డులు చూస్తే, వారణాసి వాటిని బ్రేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఒక విషయం మాత్రం క్లియర్ గా కనిపిస్తోంది. విడుదలకు ముందే భారీ బిజినెస్ జరగడం రాజమౌళి సినిమాలకు అలవాటైపోయింది. అదే ట్రెండ్ కొనసాగితే వారణాసి ఆయన కెరీర్ లోనే హైయెస్ట్ టేబుల్ ప్రాఫిట్ సాధించిన చిత్రంగా నిలిచే అవకాశాలు ఉన్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com